# గుప్పెడు గుండెను తడితే...

(కవిత్వం)

**ఎర్రగుంట సుజాత ప్రసాద్**

విరించి ప్రచురణలు

2021

**Guppedu Gundenu Thadithe...**

(A collection of Poetr)

**Smt. Y. Sujatha Prasad**
**(Pen Name : Virinchi)**
Cell : 9963169653
E-mail : sujathaprasadlpt@gmail.com

© Poet

*First Edition :*
May, 2021

*Copies : 1000*

*Book Design :*
Srinivas Moni,
Cell : 9291223136

*For Copies :*
Y. Sujatha Prasad
Vil : Lachapet - 502 108
Dist. Siddipet
Telangana State

All leading book stores

*Price*
Rs : 120/-

*Printed at :*
Sri Sai Printers
Hyderabad

ఓం శ్రీ గురుభ్యో:నమ:
ఓం శ్రీ మాత్రే నమ:





**శ్రీ విఘ్నేశ్వరాయ నమ:** **శ్రీ మహాలక్ష్మీ దేవ్యా నమ:** **శ్రీ సరస్వత్యాయ నమ:**

## శ్రీ విఘ్నేశ్వర ప్రార్థన

శ్లో॥ శుక్లాం భరదరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వ విఘ్నోపశాంతయే ॥
అగజానన పద్మార్కం గజానన మహర్నిషం
అనేక దంతం భక్తానా మేకదంత ముపాస్మహే ॥

## శ్రీ మహాలక్ష్మీ ప్రార్థన

శ్లో॥ లక్ష్మీం క్షీరసముద్ర రాజతనయాం శ్రీరంగ ధామేశ్వరీం
దాసీభూత సమస్తదేవ వనితాం లోకైక దీపాంకురాం ।
శ్రీ మన్మంద కటాక్ష లబ్ది విభవత్ బ్రహ్మేంద్ర గంగాధరామ్
త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజం వందే ముకుంద ప్రియాం ॥

## శ్రీ సరస్వతి ప్రార్థన

శ్లో॥ సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ
విధ్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మేసదా
పద్మపత్ర విశాలక్షీ పద్మ కేసరీ వర్ణనీ
నిత్యం పద్మాలయాదేవి సామాంపాతు సరస్వతీ ॥

***"సర్వేజనా సుఖినోభవంతు – సన్మంగళానిభవంతు"***



# అంకితం

శ్లో॥ పద్మాలయే పద్మసరై పద్మమాల విభూషితే
సర్వానందమయే దేవీ శ్రీ సంతోషిమాత నమోస్తుతే ॥



ఏ పూర్వజన్మ పురాకృత పుణ్యఫలమో
ఈ జన్మలో నిత్యం నిన్ను సేవించుకునే
భాగ్యం కలిగింది తల్లీ

**సంతోషిమాత**

అందుకే... నా ఈ కవితా కుసుమాన్ని నా హృదయ కమలంగా
మీ పాదాలకు అంకితమిస్తున్నాను తల్లీ!

*– ఎర్రగుంట సుజాత ప్రసాద్*

# పుస్తక ప్రదాతలు




**శ్రీ జలదంకి సుధాకర్ గారు, కీ॥శే॥ శ్రీమతి జలదంకి పద్మావతి గారు**

*మంచికి మారుపేరు*
*సుధాకర్ గారి ఎదుగుదలే తన ఒదుగుదలగా చేసుకున్న*
*ఆదర్శమూర్తి... అనురాగమయి*
*తాను తనువు చాలించినా...*
*సుధాకర్ గారి జీవితానికి వెలుగునిస్తూ*
*దిశానిర్దేశం చేస్తున్న మార్గదర్శకురాలు*
*అందుకే... ఆమె సుధాకర్ గారికి ఆత్మీయవరం...*
*ఆమె ప్రేమ అజరామరం*
*ఎంత కష్టంలోనైనా నవ్వుతూ జీవిత నాటకాన్ని నడిపే*
*గొప్ప నిజజీవిత కళాకారుడు*
*సహృదయత... సాహిత్య పోషణే వారి సహజ లక్షణం*
*నిరాడంబరత... దార్శనికత, కాల్పనికత తెలిసిన కలం యోధులు*
*మచ్చలేని వ్యక్తిత్వం సొంతం చేసుకున్న*

***శ్రీ జలదంకి సుధాకర్ గారికి, కీ॥శే॥ శ్రీమతి పద్మావతి గార్లకు***

*నమస్కారాలతో....*

***-ఎర్రగుంట సుజాత ప్రసాద్***



ప్రముఖ కవి
**నందిని సిధారెడ్డి**

# మనసును తాకే వాక్యాలు

చుట్టూ ఉండే వస్తువులే. కవిత్వంలోకి వచ్చేసరికి సరికొత్తగా భాసిస్తాయి. రోజూ వాడే భాషే. కవిత్వరూపం తీసుకునేసరికి అంతకుముందు లేని కొత్త శక్తి సంతరించుకుంటుంది. ఏ భావుకుడికయినా, భావుకురాలి కయినా లోకంతోనే సంబంధం. జీవితమే నిరంతర ప్రేరణ హృదయంలో మెదిలి, కదిలి, సంచరించే సంవేదనలు, సంజనిత భావనలు కవిత్వం వైపు నడిపిస్తాయి. సాహిత్య ప్రక్రియలన్నిటికీ జీవితమే కీలక భూమిక అయినా కవిత్వానికి జీవన ప్రకపంనలతో మరింత గాఢమైన బంధం. ప్రాకృతిక సన్నివేశాలను చిత్రించినా, మానవ సంబంధాలను వర్ణించినా, హృదయోద్వేగాలను ఉదాత్తంగా వడకట్టినా కవిత్వ శక్తికి సాటి మరొకటి లేదు. తరతతరాలుగా కవిత్వం అనేకానేక ఉత్తమ సంస్కారాలను, బలమైన భావోద్వేగాలను, స్వప్నాలను, ఆదర్శాలను మానవ జాతికి సంతరిస్తూ వచ్చింది. బహుశా, ఒంటరితనపు ఒత్తిడులను ఊరడించి, దు:ఖాలను తేటపర్చి, గాధ్గదికమవుతున్న మనసును కుదుటపర్చే కళారూపం కవిత్వమొక్కటేనేమో!

ఉన్న జీవితం నుంచే కొత్త అభివ్యక్తిని సమకూర్చుకుని, స్వరం సవరించుకుంటున్న కవయిత్రి సుజాత ప్రసాద్. తాను కల్లోలపడి కవిత్వీకరించిన భావసంపుటి 'గుప్పెడు గుండెను తడితే'. వేగవంతమైన ఉరుకులు పరుగుల జీవితంలో, ఒత్తిడుల మయమైన బాధల పాటల

హృదయంలో కవయిత్రి సుజాతా ప్రసాద్ చలించి వడకట్టిన భావోద్వేగాల సమాహారమిది. కవిత్వమంటేనే నవనవన్మేహశాలి' అన్నారు కదా, సుజాత ప్రసాద్ కొత్తగా ఊహిస్తుంది. ఆ ఊహలకు బలమైన భాషను తొడుగుతుంది. అబ్బురపరిచే భావనలతో ఆకట్టుకునేవిధంగా అక్షరాలు కూర్చుతుంది.

*"నీళ్ళలో పడిన ఉప్పురాయిలా*
*పదాల ప్రవాహంలో పడి*
*వాక్యం రోదిస్తుంటుంది*
*విరామచిహ్నాలు దాని వెక్కిళ్ళు*
*చెప్పదలిచింది ఏమిటో చెప్పకుండానే*
*ముగిసిపోవాల్సుంటుందని వాక్యానికి ముందే తెలుసు*
*.......*
*ఆమోదం కోసం ఎదురుచూడటం*
*వాక్యానికున్న సనాతన శాపం"*

–(నామనసే ఒక వాక్యం)

వాక్యానికి మనసు వాక్యంతో రూపకం చేసింది కవయిత్రి. అంతే వాక్యానికి కొత్త జీవం వచ్చింది. వరదలా వచ్చిపడే పదాల నడుమ వాక్యం రోదిస్తుంటుందని భావించటమే విశేషం. వాక్యం నడమ వచ్చే విరామ చిహ్నాలు దు:ఖించి దు:ఖించి అలిసినప్పుడు వచ్చే వెక్కిళ్ళతో సమన్వయపరిచింది. సారం వ్యక్తం కాకముందే వాక్యం ఎట్లా ముగించవలసి వస్తుందో, లోపలి గాయం సాంతం విడమర్చకముందే మనసు కూడా నియంత్రించబడుతుందని గొప్ప అర్థాన్ని ధ్వనింపచేసిందిక్కడ. ఆ లోతును ఆందుకోవటం కోసం ఎంతో లోతు కావలసి ఉండగా మరో లోతయిన భావంతో బాధను సూత్రీకరించింది. ఆమోదం కోసం ఎదురుచూడటం వాక్యానికి ఒనగూడిన శాపం అన్నది. మనసు కూడా అంతే వాసి. లోపల ఎన్ని సుడి తిరుగుతున్నా 'ఆమోదం' పొందే స్థితివరకే వ్యక్తీకరించాల్సి రావటం యుగాలుగా అనుభవిస్తున్న శాపం అని కవయిత్రి అద్భుతంగా భావించిన తీరు ఎవరినైనా కుదిపివేస్తుంది.

సుజాతా ప్రసాద్‌కు అమ్మపట్ల అంతులేని అభిమానం. నాలుగు కవితల్లో 'అమ్మ'ను గొప్పతనాన్ని ఆవిష్కరించింది. స్త్రీ దు:ఖం తెలిసినవాళ్ళే కవులవుతారు. 'అమ్మ'ను అర్థం చేసుకోగలుతారు. కవయిత్రి పలు విధాలుగా 'అమ్మ'ను ఎత్తి పట్టింది.

*"ఆకాశంలో ఉన్నా*
*మనల్ని చూస్తూనే వుంటుంది*
*గాల్లో ఉన్నా మనల్ని తాకుతూనే ఉంటుంది*
*మబ్బుల మంచె మీద కూర్చుని*
*మనందరి బతుకు పంటకు కాపలా కాస్తూ*
*వడిసెల విసురుతూనే ఉంటుంది*
*ఏ నడిజాములోనో చుక్కల్ని వెంటేసుకొని*
*మన ఇళ్ళచుట్టూ రక్షణ వెలుగురేఖల్ని గీసి వెళ్తూనే ఉంటుంది"*

–(అమ్మ ఎక్కడికీ వెళ్ళదు)

కన్న అమ్మ, సాది సవరించిన అమ్మ, స్వప్పించిన అమ్మ, అవమానపడిన అమ్మ, చులనయిన అమ్మ. తనువు చాలించిన అమ్మ వివిధ స్థితుల్లో అమ్మను వివిధ కవితల్లో కవయిత్రి చిత్రించింది. 'ఉలి దెబ్బలన్నీ భరించి అందమైన శిల్పాలుగా మలిచినా, నన్ను మాత్రం తొక్కుడుబండగానే చూస్తున్నార'ని అమ్మ పరితాపం ప్రకటించింది. సంపాదించలేదనే కొడుకులతో మాతృత్వమే ఉద్యోగమైతే అత్యధిక జీతం అమ్మకే ఇవ్వాల్సి ఉంటుందిరా' అని అమ్మ ఆత్మ నిర్భరత వ్యక్తీకరించింది. పెంచేటప్పుడు అమ్మ కొట్టే దెబ్బలను సైతం కవయిత్రి సున్నితంగా వర్ణించింది. 'నా ముద్దు ల వెనుకే కాదు– దెబ్బల వెనుక అపారమైన ప్రేమ ఉంటుందని తెలుసుకోరా వెర్రినాన్నా' అని.

అమ్మ అందరినీ విడిచి వెళ్ళిన తర్వాత కూడా ఆమె ఆత్మ, ప్రేమతో బిడ్డలచుట్టూ తిరుగాడుతుందో కాపాడుతుందో అపురూపంగా సుజాతాప్రసాద్ చిత్రించింది. ఎంతో ప్రేమ ఉంటే తప్ప, ఎంతో భావుకత ఉంటే తప్ప 'గాల్లో ఉన్నా మనల్ని తాకుతూనే ఉంటుందని' చెప్పటం సాధ్యం కాదు.

అట్లాంటిదే 'మబ్బుల మంచె మీద కూర్చుని కాపలా కాయటం, ఇళ్ళచుట్టూ వెలుగురేఖలు గీయటం'.

'తెలంగాణ ఆడపిల్ల' మంచి కవిత. తెలంగాణ సంస్కృతిని చిత్రించుతూనే, ఇక్కడి ఆడపిల్ల స్వభావాన్ని స్వరూపాన్ని, సరదాల్ని పరమ రమణీయంగా వర్ణించి కవితా నైపుణ్యానికి మెరుగుపెట్టింది.

*"శుక్కురారం లచ్మివోలె చూడచక్కంగ ఉండేది*
*వరసైన వారితో చిలిపి పరాచికాలాడేది*
*అందంగా అల్లరి చేసేది*
*స్వచ్ఛమైన మనసుతో*
*ఎవరికి ఏ కష్టం వకచ్చినా కదిలిపోయేది"*

– (తెలంగాణ ఆడపిల్ల)

తెలంగాణ ఆడపిల్లల ప్రత్యేక అస్తిత్వాన్ని చాటిన కవిత. ఇక్కడి అటలు, ఇక్కడి పాటలు, ఇక్కడి ఆరాటాలు సంతోషాలు అలంకారాలు కవితలో సహజంగా ఇమిడ్చి ఆకర్షణీయంగా రసవంతంగా తీర్చిదిద్దింది కవయిత్రి.

సౌందర్యమేనా... ఆడపిల్లల శోకం కూడా హృదయాలు కలువరపడేలా ఆవిష్కరించింది. కరుణశ్రీ 'పుష్పవిలాపం' రాస్తే సుజాతా ప్రసాద్ శిశువిలాపం ఆడశిశువు ఆర్తనాదం రచించింది. గొంతులో వడ్లగించలేసి కాఠిన్యంతో ఉరి బిగించి, సూదులు గుచ్చి శిశువులను చంపుకునే ధైన్యస్థితిని కడు విషాదంగా, విదారకంగా చిత్రించింది. కరుణశ్రీ 'అకట దయలేనివారు ఈ ఆడవారు' అంటే, ఈ కవయిత్రి 'అకట దయలేని వారు ఈ అత్తగార్లు' అన్నది. పంక్తి సవరించినట్లనిపించినా ఔచిత్యం ప్రస్ఫుటమైంది. రకరకాల దు:ఖాలు కవయిత్రి పదాల్లో, పంక్తుల్లో, పలుకుల్లో ప్రవహించాయి.

*"ఒక కన్నీటి బిందువైనా*
*కనుకొలకుల దాటి నోట జారదు*
*మెత్తని రెప్పటల మాటున*

*చెప్పుకోలేని భూకంపం*
*నా కన్నుల్లో కదిలే ప్రతి తడిరేణువూ ఒక సునామీ"*

(అమ్మకోసం)

కడుపారా ఏడవలేని స్థితి, తనివితీరా దు:ఖించలేని దుస్థితి. కన్నీటి బిందువులు, కనుకొలకులు దాటకూడదు. కవయిత్రి 'కన్నీటిబిందువు నోట జారదు' అన్నది. నోట జారేది మాట. శోకపు మాట. అది నోట జారకూడదు. చెక్కిళ్ళ మీద నోటెంబటా దు:ఖం నిషేధం. కనబడకూడదు. మానవుల దు:ఖం ఒక్కటే అయినా స్త్రీల దు:ఖం ప్రత్యేకం. అది చెప్పుకోలేని భూకంపం. అది సునామీ కావచ్చు. అయినా రెప్పల చాటునే ఉండాలి. దాటి రావద్దు. కవయిత్రి మాటలు సహృదయుల్ని కన్నీటి పర్యంతం చేస్తాయి.

సుజాత ప్రసాద్ తెలంగాణ మాటలో యాసలో ప్రతిధ్వనించే ఆత్మీయత పట్టుకున్నది. ఆకలికి అన్నమయ్యే రైతుల పరవశాలు, ఆక్రోశాలు నేతన్న దైన్యతా ఆవాహన చేసుకున్నది. మగమృగలాలకూ, మంచి మగవాళ్ళకూ, వ్యత్యాసాలు కనిపెట్టింది. నాన్నమీదా, తెలుగు మీదా, గాల్వాన్ అమరుల మీదా, కరోనా వైరస్ మీదా కవితలల్లింది. పోతన, దాశరథి, కాళోజీ, శ్రీశ్రీల మీదా, నెహ్రూ, కలాం, కాటన్, పూలే, పాపన్నల మీదా, బాలూ, జానకిల మీదా అభిమానపురస్సరంగా కవితలు గూర్చింది.

'గుప్పెడు గుండెను తడితే' గుంపులుగుంపులుగా భావాలు రొదచేస్తాయి. వాక్యాలు రాశులు రాశులుగా ఊసులు చెప్పుతాయి. హృదయం ఊరటం పడుతుంది. వేడెక్కుతుంది. అక్షర ప్రపంచం హృదయ స్థితులను వడకడుతుంది. సుజాత ప్రసాద్‌కు అక్షరనైపుణ్యం తెలుసు. హృదయ గాంభీర్యం బాగా తెలుసు. ఒకింత మనసు పెడితే మరింత మంచి కవిత్వం రాసే పదును ప్రతిభ సుజాతా ప్రసాద్‌లో వున్నాయి. వాటికి ఆహ్వానం పలుకుతూ, ప్రతిభానైపుణ్యాలకు పదును పెట్టాలని ఆకాంక్షిస్తూ అభినందిస్తున్నా...

***– నందిని సిధారెడ్డి***



కథాశిల్పి, కవిశేఖర
**ఐతా చంద్రయ్య**
రాష్ట్ర ఉపాధ్యక్షులు (తెలంగాణ)
జాతీయ సాహిత్య పరిషత్తు,
సిద్దిపేట జిల్లా

# అభినందన చందనము

*శ్లో॥ గాంధర్వంచ, కవిత్వంచ, శూరత్వం, దానశీలతా*
*అభ్యాసేన నలభ్యంతే చత్వారస్సహజ గుణా:*

గాంధర్వం, కవిత్వం, శూరత్వం, దానశీలము అభ్యాసంతో రావు. ఆ నాలుగు సహజగుణాలు అన్నారు లాక్షణికులు. అది అక్షరసత్యం.

పూర్వజన్మ సంస్కారము వల్లనే సాహితీ సౌరభం దరిజేరుతుంది. అందుకే అన్నారు "తన్నుకుంటే వచ్చేవి కవిత్వం కాదు. తన్నుకుంటూ వచ్చేది కవిత్వం" అని.

కవిత్వం గుండె లోతుల్లో ఊరి సహజంగా పొంగుకొచ్చేదే కాని బలవంతంగా రాస్తానని కూచుంటే రాదు.

పాశ్చాత్య కవితా ప్రభావంవల్ల తెలుగులోకి వచన కవిత్వం వచ్చింది. ఛందోబంధనాలను తెంచుకుని అకాశం హద్దుగా పయనించేది వచన కవిత్వం. కుందుర్తి, బాలగంగాధర తిలక్ లాంటి మహనీయులు వచన కవిత్వమెలా ఉండాలో రాసి చూపించారు. వచన కవిత్వం నిబంధనలను

సంతరించుకున్నా చక్కగా, చిక్కగా ఉంటే పాఠకులను వెంట లాక్కెళ్తుంది. అందుకే దాన్ని వచన పద్యమన్నారు.

దానికి దాశరథి అభిప్రాయం– వచన కవిత్వమంటే– "ఇది *విద్యుచ్ఛందస్సుని అందరికీ తెలిసిందే. ఇందులోని కవిత్వం ఎక్స్ కిరణం మావన హృదయాంతరాలను శోధిస్తుంది"*– వచన కవితా పితామహుడు తిలక్

"ప్రతి మాటకీ శక్తి ఉంది, పదును ఉంది

ప్రతి మాటకీ అర్థం ఉంది, ఔచిత్యం ఉంది"– అంటూ వచన కవితా రచయితలకు మార్గదర్శకం చేశాడు. కాబట్టి పదాన్ని సరిగ్గా ఎన్నుకొని వాడాలి. కవిత్వముగా మలచాలి.

వచన కవిత్వాన్ని ఆంగ్లములో, ఫ్రీవర్స్ అన్నారు. అందుకే స్వేచ్ఛగా నడుస్తుంది.

ఆధునికత జాలువారుతుంటే అన్ని భాషల్లోనూ వచన కవిత్వం పొంగి పొర్లుతుంది. అలాగే కవయిత్రి శ్రీ వై. సుజాతా ప్రసాద్ గారు వచన కవితా ధోరణిని ఆపోసన పట్టారు. ఎన్నో కవితలను ఆసక్తిగా చదివి ఆకళింపు చేసుకున్నారు.

"వంద పుస్తకాలు చదివిన వ్యక్తి మాత్రమే ఓ పుస్తకాన్ని రాయగలడు" అనేది సామెత అయినా నిజానికి దగ్గరగా వుంది. దానికి ఉదాహరణ శ్రీమతి సుజాత గారే. ఎన్నో పుస్తకాలు చదివి జీర్ణం చేసుకుని ఓ వచన కవితా సంపుటి "గుప్పెడు గుండెను తడితే"కు పాఠకుల గుండెల్లో గూడు కడ్తున్నారు. సీనియర్ రచయితలకేమాత్రం తీసిపోకుండా ఇందులోని కవితలు అలరిస్తాయి. పులకింపజేస్తాయి.

"ఆకలి కవిత్వం రాయి, ఆవకాయ కవిత్వం రాయి, పద్యంలో రాయి, నీకు చేతనైన మార్గములో నీకు చేతనైంది ఏడువ్ కాని నీవు అసలు కవిత్వం రాయి" అన్నాడు గుంటూరు శేషేంద్ర శర్మగారు. ఆ తోవలోనే

అమరజవానులనుద్దేశించిన కవిత అమర జవానులారా అమర్‌రహే లోని మచ్చుతునక–

*“వీర జవానుల్లారా!*
*మా చెయ్యి చేసే సెల్యూట్ కంటే ముందు*
*సాగిలబడి సాష్టాంగ నమస్కారం చేస్తుంది మా మనస్సు.*
*బంధాల్ని , అనుబంధాల్ని వదిలేసి*
*జాతి, మతం మరిచి మహోన్నత బంధానికి కట్టుబడి*
*ముందుకు సాగుతున్న బాలచంద్రులు మీరు!*
*మాతృదేశానికి నిత్యం సేవ చేసే పూజారులు మీరు”–*

ద్వారా దేశానికి గర్వకారణమై పుణ్యభూమాత పాదల చెంత పరవశిస్తున్న వీర జవానులకు నీరాజనాలర్పించారు.

“భారత్ కాయహనోహై, నారీ దహీ చిన్‌గారీ హై” అన్నట్టుగా భారతనారి అన్నిరంగాలలో ప్రవేశించి భళా అన్పించుకుంటుంది. కాని అక్కడక్కడా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను నిరసిస్తూ..

*“మానవత్వం మరిచిన సౌహార్దత లేని కీచకులను*
*కళ్ళతో ఉరుముతూ, కేకలతో పిడుగులు కురిపిస్తూ*
*పీచమణిచినదాన్ని–*
*అర్ధరాత్రి– అపరాత్రి అనకుండా*
*పొలిమేరల శాంతి భద్రతలు కాపాడుతూ*
*కాపు కాచే పోలేరమ్మను*
*పోచమ్మను నేను”*

అంటూ హూంకరించారు. అందుకే కవి సామ్రాజ్యాధినేత సి. నారాయణరెడ్డి గారు,

“భారత మహిళను పరీక్షించబోకు
ఆమె సహనానికి ఏలిక, సమరానికి కాళిక” అన్నారు.

భక్తపోతన తెలంగాణ వాడేనని 'సహజకవి పోతన'లో నిరూపించారు.

చక్కని భావాల వెంట పరుగెత్తే చిక్కని భాషలో కవితా వర్ష హర్షాన్ని కురిపించడంలో భాగముగా గురవు ఔన్నత్యాన్ని ఇలా చూపించారు.

"భగవంతుని దర్శింపజేసే గురువే

అజ్ఞానాన్ని హరించి జీవితానికి అర్థాన్ని ప్రసాదించే ఆత్మీయ బంధువు అన్నారు.

"గురు గోవింద్ ఖడే ఏ జగహ్, కాకైలాగుం పాంవ్

బలిహరీ గురు అపనే గోవింద్ దిఖాయా!" ను గుర్తుకు తెస్తుంటే గురువు, దేవుడు ముందు నిల్చున్నారు. ఎవరికి ముందు పాదనమస్కారం చేయాలనే సందేహానికి జవాబుగా గురువే దేవున్ని చూపించాడు. కాబట్టి గురువుకే ముందు నమస్కరిస్తాను గుర్తుచేస్తుంది కరుణశ్రీ నవరసాల్లో కరుణారసానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. ఆ మహనీయుని అడుగుజాడల్లో నడిచిన సుజాత గారు గానగంధర్వుడు యస్పీ బాలసుబ్రహ్మణ్యం గారికి నీరాజనాలర్పించారు.

*"ఓ స్వరసామ్రాట్*
*కొత్త గొంతులను  స్వరపరిచిన వీణ మూగబోయినా*
*మీ నటనా చాతుర్యం స్మృతి*
*మాకు నిత్యస్మరణీయం*
*అయినా మీ గొంతులో జీర*
*మాకు అందించి నిరంతర సాధనలో నిమగ్నమై*
*మా మనసు పొరల్లో స్ఫూర్తిని నింపుతూ*
*వెలుగురేఖలు ప్రసరిస్తూ చీకట్లను చీల్చుకుంటూ*
*శూన్యంలోంచి దీవిస్తున్నట్లుగా ఉంది"*

ఇది రసజ్ఞులను గుండెల్ని కరిగిస్తుంది. ఇలాంటిదే అమ్మను నేనై, ఆడశిశువు ఆర్తనాదకావ్యం, నాన్నా ఓ నాన్నా! కవితలు ఈ కోవకు చెందినవే.

దేశానికి, కళలకు, సమాజానికి అమూల్యమైన సేవలందించనవారిని

మనోరంజకముగా స్మరించడంలో సుజాతా ప్రసాద్ గారు మిన్న అనేందుకు అక్షర వాచస్పతి దాశరథి, అమరజీవి అబ్దుల్ కలాం, సహజకవి పోతన, శాంతిదూత మన చాచాజీ, గిడుగు కాదు పిడుగు, సినారె, సర్వాయ్ పాపన్న గౌడ్, ఓ గానగంధర్వుడా!, సప్తస్వరాల వీణ జానకమ్మ, అపర భగీరథుడు కాటన్ దొర, ఇందిరా ప్రియదర్శిని, సావిత్రిభాయి పూలె, అటల్జీ అమర్ రహే.. కవితలు చదివి తీరాలి.

ఇలా చెప్తూ పోతే ఎన్నో... ఎన్నెన్నో...

నేటి, మేటి రచయిత్రి శ్రీమతి సుజాతా ప్రసాద్ గారికి బంగారు భవిష్యత్తు వుంది.

హృదయపూర్వక అభినందనలతో...

*- ఐతా చంద్రయ్య*

## ● నా మనసులో మాట

**నా**కు సాహిత్యంలో విద్యార్థి దశనుండే ప్రవేశం ఉన్నా... స్కూల్లో చిన్నచిన్న పాటలు రాసి పాడటం, మంగళహారతులు రాసి పాడటం, ఆ తర్వాత శుభకార్యాలకి పాంప్లెంట్స్ వ్రాయడం, రేడియోలో కథానికలు, జనరల్ టాక్స్ వ్రాసి ప్రోగ్రామ్స్ చేయటం, వార్తాపత్రికలకి కవితలు పంపించడంతోనే సరిపోయింది. ఇన్నాళ్ళు పుస్తకం ముద్రించాలన్న కోరిక వాయిదా వేస్తూ వచ్చాను. కాని ఇన్నాళ్ళకు ఆ సరస్వతీమాత శ్రీమతి బండారు జయశ్రీ మేడం రూపంలో వచ్చి నేను మీకు సహాయం చేస్తానని చెప్పడంతో సరస్వతీ కటాక్షం లభించిందని చాలా సంతోషపడి ఈ పుస్తక ముద్రణకి పూనుకున్నాను.

అనుక్షణం నాలో ఆత్మవిశ్వాసం నింపుతూ విజయం వైపు నడిపించిన ఆ సర్వాంతర్యామికి భక్తిపూర్వకంగా శిరసువంచి పాదాభివందనం చేస్తున్నాను. అంతంత మాత్రంగా చదువుకున్న నాకు అక్షర జ్ఞానం కల్పించి నాతో అక్షరయజ్ఞం చేయిస్తున్న విఘ్నేశ్వరస్వామి, లక్ష్మీ, సరస్వతి, సంతోషిమాత లకు వినయ పూర్వకంగా శిరసు వంచి పాదాభివందనం చేస్తున్నాను. నా ఉన్నతికి కారకులైన నా కన్న తల్లిదండ్రులు డా॥ క్యాతం మల్లయ్య, లక్ష్మి గార్లకు, నాకు జ్ఞానభిక్ష పెట్టిన నా గురువులకు, నా అత్తమ్మ, మామయ్యలు ఎర్రగుంట విఠల్, వరలక్ష్మి గార్లకు, నా తోడునీడైన నా శ్రీవారు శ్రీ వై. ప్రసాద్ గారికి వినమ్రమతో పాదాభివందనం చేస్తున్నాను.

అడిగిందే తడవుగా అపాయింట్‌మెంట్ ఇచ్చిన శ్రీమతి గౌరవనీయు లైన కవితా హృదయం గల శ్రీమతి శ్రీ కల్వకుంట్ల కవిత మేడం గారికి, మంచుగడ్డ లాంటి మనసున్న మారాజు, స్థితప్రజ్ఞులు మనందరి ఆత్మీయసోదరుడు గౌరవనీయులైన శ్రీ కొత్త ప్రభాకర్ అన్న (పార్లమెంట్ సభ్యులు) గారికి నా ఆత్మీయపూర్వక అభివందనాలు.

నేను అడిగిందే తడవుగా వారి అమూల్యమైన సమయాన్ని వెచ్చించి నా కవితా సంపుటి చదివి 'మనస్సును తాకే వాక్యాలు'గా అభివర్ణిస్తూ మంచి భావవ్యక్తీకరణ చేసిన సాహిత్య రథసారథి, గురుతుల్యులు శ్రీ నందిని సిధారెడ్డిగారికి నా హృదయపూర్వక నమస్సులు.

'కవిత్వం పూర్వజన్మ సంస్కారం' అంటూ తమ విలువైన సమయాన్ని వెచ్చించి, అభినందన చందనాలు అందించిన గురుతుల్యులు, పితృ సమానులు, కవి పితామహులు, కథాశిల్పి శ్రీ ఐతా చంద్రయ్య సార్ గారికి నా హృదయపూర్వక నమస్సులు.

ఎల్లవేలలా సాహిత్యపరంగా నన్ను వెన్నుతట్టి ప్రోత్సాహిస్తున్న గౌరవనీయులు ప్రముఖ కవి ఏనుగు నరసింహారెడ్డిగారికి, అదేవిధంగా తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు, ప్రముఖ కవి మామిడి హరికృష్ణగారికి, సినీ గేయరచయిత డా॥ సుద్దాల అశోక్ తేజ గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

నా ప్రియనేస్తం శ్రీమతి వోలేటి శైలజక్కను అడిగి అడగగానే అక్షరదోషాలు సవరించినందుకు కృతజ్ఞతాపూర్వక అభివందనాలు.

నా అక్షరసేద్యానికి కనకవర్షం కురిపించిన సాహిత్య పోషకులు శ్రీ జలదంకి సుధాకర్ గారికి, కీ॥శే॥ శ్రీమతి జలదంకి పద్మావతి గార్లకు నా మన:పూర్వకంగా కృతజ్ఞతాభి వందనములు.

నా పుస్తకానికి అందమైన ముఖచిత్రం వేసిన శ్రీ కేసుగారి రాములు గారికి నా హృదయపూర్వక అభివందనాలు.

అనుక్షణం నా వెన్నంటి ఉండి ప్రోత్సాహిస్తున్న నా కొడుకులకు, కోడళ్ళకు నవ్వుల పువ్వుల తుషారాలు నా గుండె చప్పుళ్ళు నా ముగ్గురు మనవరాళ్ళకు నా మనవడికి నా శుభాశీస్సులు.

నన్ను చిన్నప్పటినుండి ప్రోత్సాహిస్తూ, నన్ను ముందుకు నడిపిస్తున్న మాతృసమానులైన పెద్దక్క, బావలు దోర్నాల సోమయ్య, ధనలక్ష్మి గార్లకు నా పాదాభివందనాలు. వారి కుటుంబసభ్యులకు నా ఆశీస్సులు.

నాకు స్ఫూర్తిగా నిలచిన పితృసమానులైన పెద్దన్న వదినలు రఘుపతి-పద్మ గార్లకు, చిన్నన్న వదినల సంపత్-సుజన గార్లకు నా మన:పూర్వక అభివందనాలు. వారి కుటుంబసభ్యులకు నా ఆశీస్సులు.

కీ॥శే॥ శ్రీనివాస్, అరుందతి గార్లకు, శ్రీ భాస్కర్, సుజాత గార్లకు, అక్క బావ గార్లకు మరియు ఎర్రగుంట కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు. సుగుణ, ఈశ్వరి, రాణి, లలిత వదినలకు, అన్నయ్యలకు వారి కుటుంసభ్యులకు ధన్యవాదములు. నాకు ఎంతో సహకరించిన నా ఆత్మీయ తమ్ముళ్ళు, మరదళ్ళు భరద్వాజ, లీలారాణి, ఆనంద్, సుమతి, మరియు చెల్లెలు మరిది ఆనంద్,

భారతిలకు, స్నేహప్రియకు వారి కుటుంబసభ్యులకు నా మన:పూర్వక ఆశీస్సులు. నా ఆడబిడ్డలు పద్మ వదిన, రామచంద్రం (కోల్‌మైన్ సూపర్‌వైజర్) అన్నయ్యలకు, అరుణ వదిన, రాజేశం (రిటైర్డ్ లెక్చరర్) అన్నయ్యలకు నా పాదాభివందనాలు. డా॥ కిషన్ మరియు డా॥ ప్రభావతి, ఫణిధర్, (యూ.పి.ఎస్. హెచ్.ఎం.,), గాయత్రి (ఎం.పి.పి.ఎస్., హెచ్.ఎం.) వారి కుటుంబసభ్యులకు నా ఆశీస్సులు మరియు తోటికోడళ్ళు, మరుదులు వేణు (లాయర్), పద్మ గార్లకు, వంశీకృష్ణ (సాఫ్ట్‌వేర్, సింగపూర్), అరుణ, శ్రీనివాస్ (బిజినెస్) గార్లకు, సాయి వివేక్ (సాఫ్ట్‌వేర్), శ్రీనిధి (సాఫ్ట్‌వేర్) లకు నా ఆశీస్సులు.

అనుక్షణం నన్ను ప్రోత్సాహిస్తూ పేపర్ కటింగ్‌లు పంపించిన నా మేనకోడళ్ళకు, సురేఖ (సి.ఐ.), సురేశ్ (ఎస్.జి.టి. టీచర్) లకు పావని (ఎస్.జి.టి.టీచర్), ప్రవీణ్ (బిజినెస్) లకు వారి కుటుంబ సభ్యులకు నా ఆశీస్సులు. నన్ను అనుక్షణం ప్రోత్సాహిస్తూ పై చదువులు చదివిస్తున్న చదువులతల్లి శ్రీమతి శ్రీ సామ సువర్ణ దేవి వదినకు (మహిళా కళాశాల, సిద్ధిపేట, వైస్-ప్రిన్సిపాల్) మరియు నా పుస్తకాలు సాహితీలోకానికి పరిచయం చేయాలని ప్రచురణకు నోచుకునేలా నాకు పూర్తి సహకారం అందించిన సహృదయిని శ్రీమతి శ్రీ బండారు జయశ్రీ మేడం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైర్‌పర్సన్, యాదాద్రి-భువనగిరి జిల్లా గార్లకు, నాకు స్ఫూర్తిగా నిలిచిన శ్రీమతి శ్రీ అయినంపూడి శ్రీలక్ష్మి మేడమ్ గారికి శ్రీమతి శ్రీ నామని సుజనాదేవి వదినకు నా హృదయపూర్వక అభివందనాలు.

నా ఆధ్యాత్మిక గురువులు శ్రీ చినజియార్ స్వామి గార్లకు, శ్రీ చాగంటి కోటేశ్వరరావుగార్లకు, శ్రీ సుందరచైతన్యానంద స్వామి గార్లకు, స్వర్గీయ రాజగోపాలాచారి గారికి (రామచంద్ర మిషన్), నండూరి శ్రీనివాస్ గార్లకు నా మన:పూర్వక పాదాభివందనలు.

మాతృపితృసమానులైన, పూజ్యనీయులైన పరమేశ్వరమ్మ-ధరణి అయ్యగార్లకు, జాలయ్య గారికి, నా ప్రియనేస్తం దీక్షితమ్మ గార్లకు నా మన:పూర్వక పాదాభివందనాలు.

నా ఆత్మీయ సోదరులు మడిపల్లి దక్షిణామూర్తి గార్లకి, ముదిగొండ సంతోష్ సార్ గార్లకు నా హృదయపూర్వక అభివందనాలు.

నా ఆత్మీయ సోదరులు, నా కవితా సంపుటికి మంచి పేరు సూచించి తగు సలహాలు ఇచ్చిన రామకృష్ణ స్పందన గారికి ధన్యవాదములు. ఎంతో ఓపికతో

డి.టి.పి. చేసిన వర్ధమాన కవిమిత్రులు శ్రీనివాస్ మోని గారికి, బుక్ ప్రింట్ చేసిన సురేందర్ గార్కి ప్రత్యేక అభివందనాలు.

ఆల్ ఇండియా రేడియో సోదరులు అనిల్ ప్రసాద్ సార్, శ్రీనివాస్ ఆచార్య సార్, పల్లె నాగేశ్వర్ సార్, వరప్రసాద్ సార్ గార్లకు, నిహార మేడమ్ గారికి, గోపాలరావు సార్ గార్లకు, కామేశ్వరీ మేడమ్ గారికి ఇతర సోదరీసోదరులకు నా కృతజ్ఞతలు.

నా ఆకాశవాణి మొదటి శ్రోతలు స్వర్గీయ పేర్ల లక్ష్మీ విష్ణుమూర్తి మామయ్యలకు, కీ.శే. పేర్ల వీరేశం మామయ్యగార్లకు, స్వర్గీయ అనసూయ, జగన్నాథం మామయ్య గార్లకు, కీ॥శే॥ ఎర్రగుంట లింగయ్య, కీ॥శే॥ లక్ష్మి గార్లకు నాయొక్క నమోవాచకాలు. వారి కుటుంబసభ్యులకు నా ఆశీస్సులు.

చిన్న మామయ్యలు భారతి అత్తమ్మకు, మల్లేశం మామయ్య గార్లకు రుక్మిణి అత్తమ్మ, బాలరాజు మామయ్య గార్లకు, క్రిష్ణ బాబాయ్, ప్రమీల చిన్నమ్మలకు, గోవర్ధన్ బాబాయి, సుజాత చిన్నమ్మలకు, వెంకటయ్య బాబాయి, వరలక్ష్మి చిన్నమ్మలకు నాయొక్క పాదాభివందనాలు. వారి కుటుంబసభ్యులకు నా ఆశీస్సులు.

శ్రీధర్–సుభద్ర, మధు–సుచరిత, మంజుల–భాస్కర్ అన్న, మమత– విఠల్ అన్న, మాధవి–నారాయణ అన్న, వినయ్ భరద్వాజిని, రాజు–ప్రభావతి, వేణుమాధవి రాము–జ్యోతి, వినోద్–అనిత, ప్రమోద్–స్రవంతి, మరియు మరిదులు, తోటి కోడళ్ళకు, వారి కుటుంబసభ్యులకు పేరుపేరునా ధన్యవాదములు.

నా సాహితీ మిత్రులు, పరశురాములన్న, రంగాచారి అన్న, అమ్మన చంద్రారెడ్డి సార్, పెందోట వెంకన్న, సిద్దెంకి యాదగిరి అన్న , అంజయ్య సార్ గారికి, లక్ష్మణ్ణ, రాజేశమన్న, సురేందరన్న, పప్పుల రాజిరెడ్డి అన్న, చొప్పదండి సుధాకర్ అన్న , రాజ్‌కుమార్ గంగాపురం రాజేందర్ సోదరులకు మరియు నా బాల్యస్నేహితురాలు ప్రియనేస్తం సంధ్య (ఎల్.ఐ.సి.)కు, బొందుగుల నాగమణి వదినకు, దేవేంద్ర మేడమ్ గారికి, మచ్చ అనురాధక్కకు, ఎడ్ల లక్ష్మక్కకు, శాంతాకుమారి మేడమ్ గారికి, సరస్వతి, అనితాగిరి, నిర్మలక్కకు, నిర్మల మేడమ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు లెక్చరర్, పప్పుల శైలజ మేడమ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు లెక్చరర్ గార్లకు మరియు సాహిత్య పరిషత్ సోదరసోదరీమణులకు పేరుపేరునా నా సాహిత్య కృతజ్ఞతలు.

పత్రికాసోదరులైన సాక్షి విలేఖరి నర్సింలు అన్నకు, ఇతర పత్రికా సోదరులకు పేరుపేరునా నా కృతజ్ఞతలు.

నా తప్పులను సరిచేస్తూ నన్ను ముందుకు నడిపించిన నా సాహితీ విమర్శకులు రామకృష్ణ స్పందన గారికి మరొక్కసారి నా కృతజ్ఞతలు. నాకు సెల్‌ఫోన్ సాంకేతికత నేర్పిన మా మేనల్లుడు సాయిసుధామకు ప్రత్యేక ధన్యవాదములు.

వాట్సప్ సోదరులు కుదుమ తిర్మల్‌రావు గారికి, కట్టెకోల చిన్న నర్సయ్య గారికి నా కృతజ్ఞతాభివందనాలు.

మా వాడకట్టు దోస్తులు భద్రక్క, అనూష, ఎల్లక్క, చంద్రకళక్క, ధనలక్ష్మి, సంగీత, పద్మ, అంజలి, పొలాస అరుణ వదిన, భాగ్యలక్ష్మి, నర్సవ్వ, లలిత, మమత, గంగాధర్, బాలు, సత్తిపండు, శేఖర్, శ్రీకాంత్, డా॥ అరుణ్, డా॥ కిషన్, డా॥ మల్లికార్జున్, సుమలత, వెంకటలక్ష్మి, అరుణ, మంజుల, భావన, మమత, అఖిలలకు నా కృతజ్ఞతలు.

మా వారి దోస్తులు, బాల్యస్నేహితులతోపాటు, పద్మా దేవేందర్ అన్నకు, చెన్న కృష్ణారెడ్డి గారికి, కృష్ణారెడ్డి అన్నకు, చిదంబర్ గారికి, విశ్వం, గణేష్, తోట అశోక్ గార్లకు నా కృతజ్ఞతలు.

డా॥ విజయసారథి – డా॥ సుజాత (Neurosurgeon, H.O.D., NIMS), డా॥ వంశీకృష్ణ (Neurosurgeon, NIMS), డా॥ శ్రీనివాస బాబు (Cardiologist, NIMS), డా॥ జితేందర్ (Cardiologist, NIMS), డా॥ వేణుమాదవ్ (Gastroenterologist, NIMS), డా॥ పద్మనాభం, డా॥ దీపక్, డాక్టర్ అర్థో శ్రీను, డా॥ గౌతమ్, డా॥ కపిల్, డా॥ సాయి ప్రసాద్, డా॥ తౌసిప్, డా॥ కిషన్ (Neuropsychiatrist, Karimnagar), డా॥ భరత్‌కుమార్ (Eye Specialist, Warangal), డా॥ నాగేందర్ రావు (Neuro–psychiatrist, Osmania), గార్లకు నా కృతజ్ఞతలు.

మరియు నా పుట్టినింటివారికి, మెట్టినింటివారికి, బంధుమిత్రులందరికి పేరుపేరునా నా కృతజ్ఞతలు. నా అక్షర సేద్యానికి మీరంతా ఆత్మీయ వర్షమేఘాలై ఆశీస్సుల జల్లులతో నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తూ ...

మీ

**సుజాత ప్రసాద్**

# కవితల వరుస


| | | |
|---|---|---|
| 1. | అమ్మను నైనై | 23 |
| 2. | ఓ నా చిట్టితల్లీ...! | 28 |
| 3. | ఆడశిశువు ఆర్తనాద కావ్యం | 32 |
| 4.. | జయహో... ఉస్మానియా... ! | 35 |
| 5. | అమర జవానులారా... అమర్ రహే | 37 |
| 6. | తెలంగాణ ఆడపిల్ల | 43 |
| 7. | అక్షరవాచస్పతి - దాశరథి | 46 |
| 8. | కవితా వైతాళికుడు మన కాళోజీ | 48 |
| 9. | అమ్మకోసం | 50 |
| 10. | అమ్మ ఎక్కడికీ వెళ్ళదు | 52 |
| 11. | నా మనసే ఒక వాక్యం | 55 |
| 12. | మాతృశ్రుతి | 56 |
| 13. | నాన్నా... ఓ నా నాన్నా | 60 |
| 14. | నేను రక్షకభటురాలిని! | 62 |
| 15. | 'కరోనా' భూతమా... | 65 |
| 16. | అమరజీవి అబ్దుల్ కలాం! | 68 |
| 17. | తెలుగు వెలుగులు | 70 |
| 18. | యాదాద్రి శిల్పకళా వైభవం | 72 |
| 19. | తేనెలూరు తెలుగు | 75 |
| 20. | కరోనా సమయంలో మహిళల పాత్ర శ్లాఘనీయం | 76 |
| 21. | సహజకవి పోతన | 78 |

| | | |
|---|---|---|
| 22. | జ్ఞాన కరువు - తీర్చు కల్పతరువు గురువు | 82 |
| 23. | శాంతిదూత మన చాచాజీ | 84 |
| 24. | మా సిరుల తల్లి మా సిద్దిపేటమ్మ | 86 |
| 25. | తెలంగాణ మాట మాధుర్యం | 88 |
| 26. | గిడుగు కాదు పిడుగు | 90 |
| 27. | మకరంద భాష తెలుగు భాష | 91 |
| 28. | ఆంగ్ల నూతన సంవత్సరమా... | 92 |
| 29. | శ్రీశ్రీ | 94 |
| 30. | సర్వాయి పాపన్న గౌడ్ | 95 |
| 31. | భారతదేశం పవిత్రదేశం | 97 |
| 32. | ఓ గాన గంధర్వుడా...! | 98 |
| 33. | విశ్వమాత - విశ్వదేవదూత | 101 |
| 34. | సప్తస్వరాల వీణ జానకమ్మ | 102 |
| 35. | అపరభగీరథుడు ఆర్థర్ కాటన్ దొర | 104 |
| 36. | తెలుగు భాష | 107 |
| 37. | స్వప్నలోయలో విహరిస్తున్న ఓ కాలవిహంగమా... | 109 |
| 38. | పట్టణ బతుకు - పల్లె బతుకు | 112 |
| 39. | నా కవితకు శ్రోతలు కావాలి | 115 |
| 40. | స్నేహితుల మధ్య చెలిమి - మానవతకు బలిమి | 117 |
| 41. | అక్షరమే ఆయుధం | 119 |
| 42. | తెలంగాణ బతుకమ్మ ఉయ్యాల పాట | 121 |
| 43. | మన అభిమాన నాయకుడు కె.టి.ఆర్. | 124 |
| 44. | ఇందిరా ప్రియదర్శిని | 126 |
| 45. | సావిత్రిభాయి ఫూలే | 128 |
| 46. | సాహిత్య సత్యాన్వేషకులు 'సినారె' | 130 |
| 47. | చెట్టుతో నా స్నేహం | 132 |
| 48. | చెయ్యెత్తి జై కొడ్త నేతన్న | 133 |
| 49. | ఉగాది కోసం | 137 |
| 50. | అటల్ జీ! అమర్ రహే!! | 139 |
| 51. | మంచి మగవాడు | 141 |

# అమ్మను నేనై

❖

'నేనొక కొండగుట్టని
నాలోని చిన్న ముక్కలే ఈ శిల్పాలు.
ఈ శిల్పాలు చెక్కేటప్పుడు
పడిన ఉలి దెబ్బలన్నీ నేను భరించి
వీళ్ళను అందమైన శిల్పాలుగా మార్చాను.

కానీ
నన్ను మాత్రం ఇప్పుడు
'తొక్కుడు బండ'గానే చూస్తున్నారు
మేము వచ్చింది ఈ బండలోంచే అని
గుర్తించలేకుండా పోతున్నారు

ఈ శిల్పాలను మాత్రం
దేవుళ్ళని కొలుస్తున్నారు
నేను కోరుకునేది కూడా అదే...
అలా జరిగినప్పుడే నా జన్మ ధన్యమైనట్లు
అప్పుడే నాకు నిజమైన సంతోషం... సంతృప్తి!

ఈ గౌరవం నాకు దక్కుతుందని
నా మనసుకు ముందే తెలుసు
ఈ జన్మకిది చాలు నాకు.

మీ హయాంలో
నా వృద్ధాప్యంలో కండ్లు కన్పించనప్పుడు
'కారం మెతుకులు పెడ్తుంటే
కడుపు మండుతుందిరా కన్నా!' అంటే–

'నీవేమి సంపాదించావు?
కడుపు, కాళ్ళు, చేతులు తప్ప' అన్న
కన్నకొడుకు మాటలకు మౌనంగా రోదిస్తూ–

'కన్నా మాతృత్వమే ఒక ఉద్యోగమైతే–
అత్యధిక జీతం
అమ్మకే ఇవ్వాల్సి ఉంటుందిరా!
ప్రపంచంలో కొడుకులందరూ' అనుకున్నాను మనసులో

ఎంత సంపాదించావని నేనేనాడు
నీ జేబులు తడమలేదురా
ఎప్పుడు తిన్నావు బిడ్డా అని
నీ కడుపు తడిమాను తప్ప.
నీవు ఒక ముద్ద ఎక్కువ తిన్నా
ఈ ప్రపంచాన్నే జయించినంత సంతోషపడ్డాను

కానీ–
నా సంపద తరిగిపోతునందని బాధపడలేదురా–
నీవు కాస్త ముద్దుగా బొద్దుగా అయి బరువు పెరిగినప్పుడు
ఈ భూ ప్రపంచంలోని సంపదంతా

నా దగ్గరున్నట్లు సంతోషించాను

చిన్నప్పుడు చలికి వణికిపోతుంటే
నా ఒడినే దుప్పటిగా మార్చి నిన్ను కాపాడాను
నీవు పెద్దయ్యాక సమస్యలతో సతమతమవుతుంటే
ప్రార్థనతో నిన్ను కాపాడుకున్నాను

నోరు విప్పి చెప్పకపోయినా
ఈ అమ్మకు సమస్తం అర్థమవుతుందిరా!
నా ముద్దుల వెనకే కాదు–
దెబ్బల వెనుక అపారమైన ప్రేమ ఉంటుందని
తెలుసుకోరా వెర్రి నాన్న–
'నేనొక తొణకని నిండు కుండని' అని
నీకు తెలీదు కాబోలు!

'ఛీ రోగాల పుట్టవు
ఎందుకు బతుకుతున్నావు ఇంకా ఈ బతుకు?' అన్నప్పుడు
స్వర్గంలో వెతికినా
అమ్మను మించిన గొప్ప వైద్యురాలు దొరకదురా
ఎందుకంటే
నీవు ఆరోగ్యంగా ఉండాలని
నా రక్తాన్నే చనుపాలుగా మార్చి
అన్నీ తానై నీకు అందించి
ఆరోగ్యంగా ఉండాలని
అహర్నిశలు
నిన్ను కంటికి రెప్పలా కాపాడానురా–

'ఛీ... ఛీ... దెయ్యం మొహమా
ఏం రూపం ఎలా ఉన్నావు..

నిన్ను తల్లిగా పరిచయం చేయాలంటేనే
నామోషిగా ఉంది' అన్న పుత్రుని మాటలకు

'నీకంటూ ఓ అస్తిత్వం లేనప్పుడు కూడా
నిన్ను ప్రేమించానురా–
నువ్వెలా ఉంటావో తెలియకపోయినా
నీవు అందంగా పుట్టాలని
వేయి దేవుళ్ళకు మొక్కుకున్నా
నిన్ను చూసి ఎంతో మురిసిపోయానురా!

'సిగ్గులేదు నీకు...
ఎందుకే ఆడజన్మ ఎత్తావు
చావరాదు' అని
దెప్పిపొడుపు మాటలు మాట్లాడినప్పుడు

'నువ్వు జన్మించడానికి గంట ముందు నుంచే
నీ కోసం
ప్రాణాలు అర్పించడానికి సిద్ధపడ్డానురా
ఇప్పటికైనా తెలుసుకోరా కన్నా
'అమ్మ మనసెంత గొప్పదో'

నేను అమ్మనై
ఏ విషయమైనా రెండు కోణాల్లోంచి ఆలోచిస్తాను–
ఒకసారి నీవైపు నుంచి–
ఒకసారి నా వైపు నుంచి
మీ పదిమందినీ
ఈ ఒక్క చేత్తోనే
కడుపులో పెట్టుకుని పెంచాను
కానీ,

నేనొక్కదాన్నే మీకు బరువై–
శ్మశానంలో దిగబెడ్తున్నందుకు
నేను బాధపడటం లేదు కొడుకా...
మీ సంతోషమే నా సంతోషంగా భావిస్తాను గానీ–
నీకు ఇదే గతి పట్టకూడదని
ఆ దేవున్ని వేడుకుంటున్నాను

నాకు ప్రపంచమే తెలియదనుకుంటున్నావేమో కానీ–
నేను ఈ ప్రపంచాన్నే వదిలివెళ్ళాక కానీ
అర్థం కాదు నీకు–
ఈ అమ్మ గొప్ప 'తత్వవేత్త' అని–

నాలో ఎన్ని హంగులున్నా
అవి అవసరమైనప్పుడే బయటకి ప్రదర్శిస్తానని
ఈ మూర్ఖులకి తెలియదని
నాలో నేనే
లోలోన నవ్వుకుంటున్నాని
తెలియదు వీళ్ళకు

అందుకే
జీవితాన్ని వరంగా ఇచ్చిన అమ్మకు
ఏ బహుమతి ఇచ్చినా తక్కువేనని
మన పుత్రులందరూ
తెలుసుకొని మసలుకోవాలి.

*(మాతృదినోత్సవం సందర్భంగా రాసిన కవిత*
*ఒక కొడుకు తన తల్లిని స్మశానంలో విడిచిపెట్టి వెళ్ళిన సందర్భంలో*
*స్పందించి రాసిన కవిత, 'సాక్షి' దినపత్రిక, 13-05-2018)*

# ఓ నా చిట్టితల్లీ...!

❖

ఓ నా చిట్టి తల్లీ మహికే కళవు నీవు.
ఇలకే వెలుగు నీవు
సృష్టికే సృష్టికర్తవునీవు
కష్టాల కడలిలో తేలిపోతున్న
కన్నీటి సంద్రంలో కొట్టుకుపోతున్న
ఆప్యాయత హృదయంతో అనురాగం అందిస్తున్నా
కొంత నీ సహనానికి ఉండాలి సరిహద్దు తల్లి!
అది నీ చేతగానితనం అనే భావన వద్దు తల్లి!!

ఇకనైనా
నీ అనంత సహన సాగర ప్రవాహానికి
కాస్త అడ్డుకట్టవేసి
నిన్ను కన్నీటి సంద్రంలో ముంచెత్తుతున్న
మగ మృగాలను
సూర్యుని ఒక కన్నుగా,
చంద్రుని రెండో కన్నుగా,
తెలివిని మూడో కన్నుగా,
ధైర్యాన్ని ఇనుప గునపాల ఆయుధంగా మార్చి

మదమెక్కిన మగ తోడేళ్ళను
అపరకాళిలా దునుమాడాలి తల్లి!

మన చిన్నారి లేతకూనలందరూ ఒక్కటై
గడ్డిపోచలం కాదు
గట్టిగా పేనిన మీ పాలిటి ఉరితాళ్లమని
నిరూపించాలి తల్లి.

ఓ బంగారు తల్లి
నీవు రాల్చే ప్రతి కన్నీటిబొట్టు
నవవసంత సమాజ స్థాపనకు
శ్రీకారం చుట్టాలి తల్లి.

కుళ్ళిపోతున్న కళ్ళులేని చట్టాల్ని
ఈ సమాజపు కుళ్ళును
వేళ్లతో సహా పెరికి వేసి
నిత్య–నిర్మల–నిర్భయ సమాజ స్థాపన సాధించాలంటే
మనలో కూడా మార్పు రావాలి తల్లి.

ఎందుకంటే
మగవారిని నిందించి ఏం ప్రయోజనం
మన వైఖరి అంటే–
మన వస్త్రధారణ మార్చి
మన సంస్కృతిని చాటి చెప్పినపుడే
ఈ మార్పు సాధ్యం తల్లి.

ఏరులై పారుతున్న మద్యపానాన్ని–
మాదకద్రవ్యాలను అరికట్టాలి
మన సంస్కృతిని కించపరిచే

ప్రసార మాధ్యమాలలో అశ్లీల చలన చిత్రాల సామ్రాజ్యాన్ని-
క్లబ్బులు-పబ్బులు-
వెబ్ సైబర్ల విష సంస్కృతిని అరికట్టినపుడే
ఈ దుష్ట దుశ్శాసనుల పీచమణచవచ్చు తల్లి.

పాలబుగ్గల పసిడి మొగ్గల చిట్టితల్లుల్ని
చిదిమేసి- నలిపేసి- పశువాంఛకి బలిచేసే కామందులను
కర్కశంగా కసితీరా
బహిరంగంగా ఉరి తీయాలి తల్లి.

రక్త బీజుడిలా పుట్టుకొస్తున్న కామ పిశాచాలను
"కాస్ట్రేషన్" పేరుతో కత్తెర వేయాలి తల్లి.
ఒకరిని చూసి ఒకరు
నెత్తురు తాగడం మరిగిన వ్యాఘ్రంలా
గాండ్రించే మగ మృగాల కుత్తుకలు
తెగ కోసేయాలి తల్లి.

అరబ్ దేశాల్లో మాదిరిగా
రాళ్లతో కొట్టికొట్టి పబ్లిక్‌గా ఉరి తీయాలి తల్లి
అప్పుడే
రక్షణలేని ప్రజాస్వామ్యానికి
ప్రజల ముందే ప్రక్షాళన గావించినట్లవుతుంది.
అప్పుడే
ఆడపిల్లల జీవితాల్ని నిర్దాక్షిణ్యంగా హింసించి
బంగారు భవిష్యత్తులను బలితీసుకున్న కీచకుల పని పట్టినప్పుడే
ఆడపిల్లల మృత్యుఘోష ఆగుతుంది తల్లి.

నిండు పున్నమి లాంటి బాలబాలికల జీవితాన్ని
గ్రహణం పట్టిన జాబిల్లిలా విషాద భరితకావ్యం కాకుండా

రాహుకేతువుల పని పట్టి
నీవు చరిత్ర గతులు తిరగేసి రాయాలి తల్లి.

ప్రతి తల్లి తండ్రి రంపపు కోత తట్టుకొని
ఇంటి పరువు బజారున పడుతుందని
భయపడి బయటపెట్టని చిట్టితల్లుల జీవితాలు
ఎన్నో ఎన్నెన్నో.....

నేరం చేయాలంటే తలచుకుని వణికే  రోజులు
మగ మృగాలు ఉలికిపడే రోజులు తేవాలి తల్లి.

అందుకే నేరస్తులు ఎవరయినా
ఎంతటి వారైనా క్షమించకుండా
"ఫాస్ట్ ట్రాక్" కోర్టులో శిక్షలు
క్షణంలో అమలయ్యే స్థితిని కల్పించాలి తల్లి.

అప్పుడే
మనకు మనమే రక్షణ కల్పించుకున్న వాళ్లమవుతాం
మనకు మనమే ఆయుధాలమవుతం తల్లి!!

*(వరంగల్‌లో ఆర్నెల్ల పసిపాపపై జరిగిన అత్యాచారానికి స్పందించి రాసిన కవిత, 'మెట్రో'ఉదయం',    10-02-2020 ప్రచురణ)*

# ఆడశిశువు ఆర్తనాద కావ్యం

❖

వచనం : ఆడపిల్లలు అట్లతద్దె రోజు ఆడుకునే ఆటలు చూడాలని ప్రొద్దున్నే మా తోటలో కెళ్ళాను ప్రభూ... ఉదయమే అరుణారుణ కాంతులతో ఉద్యానవనం కళకళలాడుతోంది – చిట్టితల్లులు ఊయలలూగుచూ అల్లారుముద్దుగా అమ్మ ఒడిలో ఆడుకొంటున్నారు
సంతృప్తిగా చూసి సంతోషించాను ప్రభూ!
నేనొక వైద్యురాలిని ఒక మాతృమూర్తి ఆవేదన విని శస్త్రచికిత్సకై సిద్ధమవుతుండగా–చికిత్స చేయునంతలో–అమ్మా అను ఆర్తనాదం విని ఉలిక్కిపడ్డాను.

గానం : అప్పుడు– గోరానెడు నంతలోన ఓ చిన్న శిశువు జాలిగా నోరువిప్పి నా ప్రాణాలు తీతువా యనుచు భావురుమన్నది కృంగిపోతి నా మానస మందేదో తళుక్కుమన్నది ఆడశిశువు ఆర్తనాదకావ్యమై

వచనం : అంతలో ఒక చిన్నిశిశువు తన సన్నని గొంతుతో నన్ను జూచి ఇలా అన్నది ప్రభూ–

గానం : ఆడపిల్లగా జనియించి కనిపెంచిన కన్నతల్లి జాతీయత దిద్ది తీర్తుము –
తదీయ కరమ్ములలోన స్వేచ్ఛమై ఊయల లూగుచున్

మురియుచుందుము
అలసిసొలసి ఆయమచల్లని ఒడిలో ఆడమరిచి నిదురపోయే వేళ
ఆడపిల్లనని జాలిమరిచి ఆయువు తీయుచునుండె ఈ మగవాడు

వచనం : ఎందుకయ్యా మా స్వేచ్ఛా జీవనానికి అడ్డువస్తావు? మేము నీకేం అపకారం చేసాము?

గానం : తాతని గౌరవింతుము... తండ్రిని గౌరవింతుము...
మమ్మాశ్రయించు మగజాతిని గౌరవింతుము..
స్వతంత్ర్యుల మమ్ముల స్వార్థబుద్ధితో వెలుగు చూడకుండానే తాలుము త్రుంపబోకుము తల్లికి బిడ్డకు వేరుసేతువే- తనను కన్నది కూడా ఒక ఆడదేనని మాట మరిచెనేమో ఈ మగవాడు-

వచనం : ఇంతలో ఒక చిన్న శిశువు కోపంతో మొగమంతా ఎర్రబడి నన్ను చూసి ఇలా అంది ప్రభూ...

గానం : వడ్లగింజలేసి మా గొంతుకురి బిగించి గుండెలో సూదులు గ్రుచ్చీ గ్రుచ్చీ ముక్కలయినానని మూగపోదురు అమ్మలు- ఆడబిడ్డ వద్దు వద్దనే అత్తకూడా తాను ఆడదేననే మాట మరిచే- అకటా దయలేని వారు ఈ అత్తగార్లు...!!

వచనం : పాపం మీరు దయాదాక్షిణ్యాలు లేని మగవారు కాబోలునే

గానం : మా పూలవంటి ముగ్దసుకుమార- సుగంధ- మరంధ - మధురీ
జీవితమెల్ల మీకై త్యజించి, కృశించి, నశించిపోయే-
మా యవ్వనమెల్ల కొల్లగొని ఆపై అగ్నికి ఆహుతిచేసి
మమ్మావల పారవేతురు కదా... మగజాతికి నీతియున్నదా?...

వచనం : ఓయి మగవాడా...!

గానం : బుద్ధ దేవుని భూమిలో పుట్టినావు
సహజమగు ప్రేమ నీలోన చచ్చెనేమి...?
అందమును యాసిడ్‌తో హత్యచేసెడి హంతకుండ
మైలపడిపోయెనోయి నీ మనుజ జన్మ...!!
మైలపడిపోయెనోయి నీ మనుజ జన్మ...!!

వచనం : అని దూషించే పసిపాపల్ని చంపలేక – భ్రూణహత్యలు చేయనని ప్రతిజ్ఞ చేస్తూ నా అపరాధాల్ని మన్నించుమని మీ పాదాలపై పడి వేడుకుంటున్నాను ప్రభూ.. ప్రభూ... ప్రభూ...

*('దిశ' (ప్రియాంక) సంఘటన జరిగిన సందర్భంగా స్పందించి రాసిన కవిత...)*

# జయహో... ఉస్మానియా..!

❖

జయహో...
ఉస్మానియా విశ్వవిద్యాలయమా!
వినయం- విద్యా- జ్ఞానం నేర్పిన సరస్వతి నిలయమా!

మీర్ ఉస్మాన్ అలీఖాన్
ఉదార స్వభావానికి నిదర్శనమా!
వందేళ్ళ ఘనచరిత్రకు సజీవ సాక్ష్యమా!
నాగరికతకు నడకలు నేర్పిన ప్రదేశమా!

విద్యాకుసుమాలను
వికసింపజేసిన ఉద్యానవనమా!
నిరక్షరాస్యతను పారద్రోలే
పవిత్ర దేవాలయమా!

1600 ఎకరాలలో వ్యాపించి
వడ్డెరబస్తీల చెమటతో కట్టిన
ఆర్ట్స్ కాలేజీ మీకు తలమానికం
హైద్రాబాదుకే కీర్తి కిరీటం మీరు!

మన మాజీ ప్రధానమంత్రి

పి.వి.నరసింహారావుగారు కూడా మీ పూర్వ విద్యార్థే!
చరిత్ర చదివిన మేధావులంతా
మీలో విద్యాబుద్ధులు నేర్చుకున్నవారే!

మీనుంచే మొదలైనాయి
తెలంగాణ ఆత్మగౌరవ పోరాటాలు!
మీ విద్యార్థుల బలిదానమే ఈ నవతెలంగాణము!

మీకు "యూనివర్సిటీ ఆఫ్ ఎక్సలెంట్ అవార్డు"
ఇవ్వడం మాకు ఎంతో గర్వకారణం!
ఉద్రేకానికి– ఉత్సాహానికి
ఊపిరిలూదిన మీ ప్రోత్సాహం!
ఉత్తమ సమాజ స్థాపనకు
విప్లవ ఉద్యమ శంఖారావం!

మరో ప్రపంచ ప్రస్థానానికి పురోగమించే ప్రవచనం!
సారధ్యానికి – సంకేతానికి సమరసభావ సందేశం!
విద్యాధికులకు కల్పతరువువు – కవుల పాలిట కనకధారవు
సాటిలేని మేటి మీరు!

కదిలే కాలచక్రంలో మార్పులెన్నున్నా
చరిత్రపుటలలో స్వర్ణలిఖితం మీ ఘనచరిత్ర
జయహెూ జయజయహో!

*(ఉస్మానియా యూనివర్సిటీ వందేళ్ళ ఘనచరిత్రను చాటుతూ రాసిన కవిత...)*

# అమర జవానులారా... అమర్ రహే...

❖

నూటాముప్పై కోట్ల గుండెలు
బాధతప్తహృదయాలతో కృంగిపోతున్న
మీ త్యాగాలు చూసి సజలనేత్రాలతో
పాదాభివందనం చేస్తున్నాం
వాస్తవాధీనరేఖ వద్ద
దేగకళ్లనే కెమెరాలుగా మార్చి పహరకాస్తున్నారు మీరు
భగభగమండే మండుటెడారిలో సైతం
బుల్లెట్ల వర్షాలై మెరుస్తున్న మీరు
కాశ్మీర్ మంచు కొండల్లో
తీవ్రవాదులు చొరబడకుండా గుండె నిలిపినారు
తూర్పు కనుమల్లో
సందించిన విల్లులా సంచరిస్తున్న మీరు!

ఉదయం కంటికి రెప్పలా కాపాలకాసే
ఉదయసూర్యులు మీరే...
రాత్రిళ్ళు ప్రాణాలొడ్డి పహరాకాసే
పున్నమి చంద్రులు మీరే...
నూటాముప్పై కోట్ల గుండెల్లో

అంతరంగ అభిమాన మూర్తులు మీరే
గల్వాన్ లోయలో జరిగిన ఘటనకు
కరిగి నీరై పోయినవి మంచు కొండలే కాదు
నూటాముప్ఫై కోట్ల పౌరుల
నేత్రాలు కరిగి కన్నీరు కార్చుతున్నవి

తల్లి కోడి
తన పిల్లల్ని గుండెల్లో అదుముకొని
రెక్కల మాటున పొదువుకున్నట్లు
మీ హస్తాలు...
దేశం చుట్టు అల్లుకున్న రక్షణ కవచాలు
మీ కళ్ళు...
దేశాన్ని నిరంతరం కాపాడుతున్న
నిఘా కెమెరాలు కాదు అవి త్రినేత్రాలు
మీ చురుకైన కళ్ళు!!

కఠిన శిక్షణలో  రాటుదేలిన మీ వొళ్ళు,
ఆత్మస్థైర్యంతో కూడిన సింహం లాంటి మీ నడక,
ఆత్మీయ పలకరింపుతో మీరు
ఎర్రకోటలో కవాతు చేస్తుంటే
ప్రతి పౌరుడి గుండె గర్వపడుతోంది
సరిహద్దుల్ని కాపలా కాయడమే  కాదు
ప్రకృతి ప్రళయాలకు, పరుగెత్తుకొచ్చి ఆదుకునేది మీరే
విలయాన్ని- విషాదాన్ని దాటుకుంటూ
దేశ జెండాల నిలబడి
ఆత్మవిశ్వాసాన్ని  నలు దిక్కులా పరిచేది మీరే!!

దేవుడు మ్రొక్కితేనే వచ్చి కాపాడతాడు
కానీ మీరు దేశానికి ఏ కష్టం వచ్చినా

వెన్నంటి ఉండి వెన్ను తట్టి నిలబడుతారు
మా దేహం ఎన్ని ముక్కలైన కానీ
దేశం ముక్కలు కాకుడదనే భావనతోనే
ప్రాణలొడ్డి పోరాడుతారు.

'దేశోపకార మిదం శరీరం' అన్నట్లుగా
మీరు భారతమాత ఒడిలోంచి జారిన ముత్యాలు కాదు
భారతమాత కంఠసీమలో ధరించిన కెంపులు మీరు!

డ్రాగన్‌ల దాడిలో
20 మంది జవానుల గుండెలు ఎగిరి పడ్డాయో
ఎంతమంది ఆత్మీయులు ఆర్తనాధం చేసారో
ఎంత దుఃఖం వేదనో
ఇది మీ తల్లుల కడుపు కోత కాదు
నూటాముప్పై కోట్ల ప్రజల గుండెకోత
ఇది వ్యక్తిగతం కాదు వ్యవస్థాగతం!

కందకాల్లో, ముండ్లకంపల్లో
హిమాలయశిఖరాల్లో, ఎడారుల్లో
అడవుల్లో లోయల్లో,
మీ ఊపిరి మిమ్మల్నే భయపెట్టే సమయంలో,
గుండెల నిండా దేశభక్తిని నింపుకొని
మృత్యుఛాయలో సైతం నిర్భయంగా
మీరు కాసే పహారా వల్లే కదా
దేశమంతా నిచ్చింతగా బ్రతుకుతున్నది.
స్వేచ్ఛను గుండెల నిండా పీల్చుతూ
దేశం సగర్వంగా తలెత్తుకొని తిరుగుతున్నది
దేశరక్షణ భాధ్యతను సమర్ధవంతంగా మోస్తూ
దేశం ప్రశాంతంగా ఉండేలా చూసే

మీ వృత్తి ధర్మాన్ని... ప్రవృత్తి గుణాన్ని
ఎలా విస్మరించగలం.
మీ అసువులు తీసిన విద్రోహులను
దేశం యావత్తు అసహ్యహించుకుంటుంది.
అందుకు ప్రతిగా చైనా వస్తువులన్నీ నిషేధిస్తాం

వీర జవానుల్లారా
మా చెయ్యి చేసే సెల్యూట్ కంటే ముందు
సాగిలపడి సాష్టాంగ ప్రణామాలు చేస్తుంది మా మనస్సు
బంధాన్ని, అనుబంధాల్ని వదిలేసి,
జాతి మతం మరిచి మహోన్నత బంధానికి కట్టుబడి
ముందుకు సాగుతున్న బాలచంద్రులు మీరు!
మాతృదేశానికి నిత్యం సేవ చేసే పూజారులు మీరు!!

మీ కుటుంబ జ్ఞాపకాల్లో
ఎంత దిగులో
ఎన్ని సంతోషాలకు దూరమవుతారో
ఎన్ని కన్నీళ్లను దిగమింగుకుంటారో కదా!

మనసును శిలలాగ మార్చి
మీ కన్నీళ్లను గడ్డకట్టించి,
పెదాల మాటున రక్తబంధాన్ని
పాదాల దిగువున స్నేహ సుగంధాన్ని మాయం చేసి
ఒకే లక్ష్యంతో...
ఒకే నినాదంతో...
ఒకే గమనంతో...
దూసుకెళ్తున్న మీరు
పిట్ట కన్నును మాత్రమే చూసే
ఆధునిక అర్జునులు

రాగ ద్వేషాల కన్న
దేశభక్తిలోనే ఆత్మానందాన్ని వెతుక్కునే
అపర భీష్ములు మీరు
అందుకేనేమో...
మన దేశమాత మిమ్మల్ని ఒడిలో పొదువుకొని
లాలి పాటలతో లాలిస్తుంది
ప్రతి గడప మీకోసం ఎదురుచూస్తున్నది
ప్రతీ పౌరుడు మీ పేరే జపిస్తున్నాడు

నూటాముప్పై కోట్ల ప్రజల మానప్రాణాలు
మీ చేతుల్లో ఉన్నాయనే భావన
మీకెంత ఆనందాన్ని బాధ్యతనీ పెంచుతుందో
గగనతలంలో వాయుసేన...
నీటిలో జలసేన, భూమ్మీద సైనికా సేనలను
మూడు కన్నులుగా భావించి సేవలందిస్తున్నారు

గాల్వాన్ లో డ్రాగన్‌ల దాడికి
నెలకొరిగిన అమర సీపాయిల్లారా
మీరే మా హీరోలు,
వీరులు, ధీరులు మీరే
మా ధైర్యం, స్థైర్యం,
బలం బలగం మీరే
భిన్నత్వంలో, ఏకత్వం చూసిన
దేశ ప్రజలందరం గొంతెత్తి చెప్తున్నాం
శాంతి స్థాపించే యుద్ధంలో
మీ మరణం
ఆఖరి వాక్యం కాదు,
మీ త్యాగం
చివరి చరణం కాదు.

మాతృభూమి రక్షణలో
మీ వీరత్వం విజయసంకేతం,
మీ ధీరత్వం ఆత్మవిశ్వసనా కేతనం.
మీ పట్టుదల, పౌరుషం, నిబద్ధత
మాకు నిత్యస్ఫూర్తి !
మీ నిజాయితీ నిస్వార్థం
మాకు నిరంతర దీప్తి!!

అందుకే
ప్రజల గుండెల్లో కళ్ళలో మీరుంటారు
మా తొలివేకువ ప్రార్థనలో మీరుంటారు
అమర జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని
వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుంది
ఈ దేశం యావత్తు
దొంగదెబ్బ తీసిన డ్రాగన్లకు తగిన శాస్తి చేయడమే
మేము మికిచ్చే ఘన నివాళి!!

భారత గగనసీమలో
మీరు ధృవతారలై వెలుగొందాలని
భిన్నత్వంలో ఏకత్వమయిన
అందరం ఒకే గళంతో...
"అమరజవానులరా అమర్ రహే అమర్ రహే.." అని
అశ్రునివాళి అర్పిస్తున్నాం...

*('గాల్వాన్ లోయ'లో జరిగిన దుర్ఘటన సందర్భంగా స్పందించి రాసిన కవిత... 'మెట్రో ఉదయం' పత్రికలో ప్రచురణ)*

# తెలంగాణ ఆడపిల్ల

❖

యాడనన్న గీ ఆడపిల్ల జాడ తెలిస్తే
జర చెప్పురాదుండ్రి
దేశాలు తిరిగినం...
రాష్ట్రాలు తిరిగినం
వాకిట్లో వెతికినం...
వాడకట్లల్లో వెతికినం
పాఠశాలలో వెతికినం...
కళాశాలలో వెతికినం
పల్లెల్లో వెతికినం...
పట్నాల్లో వెతికినం

అబ్బ యాడనన్న గీ ఆడపిల్ల జాడ తెలిస్తే
జర చెప్పురాదుండ్రి
ఆ పిల్ల ఎట్లా ఉంటుందనుకుంటుండ్రు
ముద్దబంతసోంటి ముఖానికి ...
ముద్దపసుపు పూసుకుని
నిండు ముత్తైదువోలె...
కళ్ళనిండా కాటుక పెట్టుకుని

సూర్యబింబమోలె...
గుండ్రని బొట్టు పెట్టుకునేది
తలపై నాగపణి పెట్టి...
బారెడు జుట్టు బిగించి అల్లి
జడ గంటలు వేసుకుని తలనిండా పూలు తురుమేది
మైదాకు పెట్టుకుని ఎర్రగా పండిన చేతులను చూసుకుని
మంచి మొగుడొస్తాడని కలలు కనేది
చేతుల నిండా
రంగురంగుల మట్టిగాజులు తొడుక్కుని మురిసిపోయేది
కాళ్ళకు గల్లర గల్లర గజ్జెల పట్టాలేసుకుని,
చెవులకు బుట్టాలు, జిగ్నీలు, చెంప చేరాలు పెట్టుకునేది
పట్టులంగా ఓణీలతో అపుడే విచ్చిన దాసన్నపువ్వోలె
విరబూసిన ముద్దబంతోలె ముసిముసినవ్వులు నవ్వేది

ఇంకా ఏం చెపుదుము
శుక్కురారం లచ్మివోలె సూడసక్కంగ ఉంటది
వరసైనవారితో చిలిపి పరాచికాలు ఆడేది
అందంగా అల్లరిచేసేది
గావురంగా మారాం చేసేది
స్వచ్ఛమైన మనసుతో
ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా కదిలిపోయేది
పెళ్ళి పేరంటాల్లో అంతా తానయి కలియతిరిగేది
బతుకమ్మ పండుగనాడు
ఉయ్యాల పాటలు పాడుతూ కోలాటాలు వేసేది
కార్తీక స్నానాలకు నిద్రలేచేది
తోటి బాలలతోటి చెమ్మచెక్కలాడేది
చింతచెట్లకు ఊయల కట్టి ఊగుతూ సంబరపడేది
తొక్కుడు బిల్లలాడుతూ చిందులేసేది
ధనుర్మాసం అంతా వాకిళ్ల నిండా

సుక్కల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టి మురిసిపోయేది
వానలో తడుస్తూ కాగితం పడవలు చేసి సంతోషించేది
వెన్నన్నా, జున్నన్నా, మక్కజొన్న కంకులన్నా,
చింతపలక పండ్లన్న, తాటి ముంజలన్న, తాటిగేగులన్న
ఎంతో ఇష్ఠంగా తినేది

అసోంటి అచ్చమైన పదహారణాల
తెలుగింటి ఆడపిల్ల కనిపిస్తలేదు
దేశాలు తిరిగినం...
రాష్ట్రాలు తిరిగినం...
వాకిట్లో వెతికినం...
వాడకట్లల్లో వెతికినం...
పాఠశాలల్లో వెతికినం..
కళాశాలల్లో వెతికినం
పల్లెల్లోనూ... పట్నాల్లోనూ
వెతికి వెతికి వేసారిపోయాం
అబ్బ యాడనన్న గీ ఆడపిల్ల జాడ తెలిస్తే
జర చెప్పరాదుండ్రి

"ఆ... కన్పించింది, కన్పించింది
అచ్చమైన తెలుగింటి ఆడపిల్ల
మన తెలంగాణలోనే కన్పించింది".

*(సంక్రాంతి పర్వదినం సందర్భంగా జరిగిన కవిసమ్మేళనంలో )*

# అక్షరవాచస్పతి - దాశరథి

❖

ఓ కవిపితామహా...
వెంకటాచార్య, వెంకటమ్మల పుణ్యదంపతులకు జన్మించిన
శుభోదయ సూర్యులు మీరు!

తెలంగాణ సాహిత్యానికి సారథి
ప్రజాఉద్యమానికి వారధులు మీరు

మహాశయా!
మీ కలం అగ్ని కణం
ప్రతీ అక్షరం వజ్రాయుధం
అక్షరాలను ఆయుధంగా ఎక్కుపెట్టిన సవ్యసాచులు మీరు
నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకించి
ప్రజాఉద్యమమే ప్రాణమన్న ధీశాలి మీరు.

'నా పేరు ప్రజాకోటి - నా ఊరు ప్రజావాటి' అన్నారు
మీ రచనల్లో నవరసాలొలికించి
జాతిని జాగృతం చేసిన పదకవితామూర్తులు.
తెలంగాణ కన్నీళ్లను అగ్నిధారగామలచి

‘నా తెలంగాణ కోటి రతనాల వీణ’ని నినదించి
భవిష్యత్తు తరాలకు మార్గదర్శకులయ్యారు.
నిజాం పిశాచిపై పదతూటాలను ఎక్కుపెట్టిన
అక్షర వాచస్పతి విప్లవ కవులు మీరు.

‘ఆ చల్లని సముద్రగర్భంలో’ అన్న పాట వ్రాసి
ఆశ్రిత జనహృదయాల్లో వెలుగుతున్న
సమరయోధులు – సంఘ సంస్కర్తలు మీరు.
‘కవితాపుష్పకం’… ‘తిమిరంతో సమరం’… ‘అగ్నిధార’…
ఇత్యాది రచనలతో
“కళ ప్రపూర్ణ”, “కవితా సారధి” బిరుదులు పొందిన మీరు
మహానుభావులు…, మాకు సదా స్మరణీయులు!!

*(దాశరథి జయంతి సందర్భంగా రాసిన కవిత)*

# కవితా వైతాళికుడు మన కాళోజి

❖

చెమ్మగిల్లిన కన్నులతో
కమ్మలెన్నో చదివిన కవితా వైతాళికుడు
మన కాళోజీ!

రంగారావు – రమాబాయమ్మలకు జన్మించినా
ఏడు నెలల వయసులోన అన్న భుజం నెక్కిన నేను
ఎనభై ఏళ్ళ వయసులో అన్ననే ఆసరాగా చేసుకున్న
అచంచలమైన సోదర ప్రేమను చాటుకున్న
ఆత్మీయతామూర్తి మన కాళోజీ!!

నిజాం నిరంకుశత్వాన్ని వ్యతిరేకించి
తూర్పారపట్టిన గళం కాళోజీ కలం–
అన్యాయాన్ని ఎదిరించేవాడే నాకు ఆరాధ్యుడు అన్న
నిత్యసత్యాగ్రహ ఉద్యమ సమరశీలి మన కాళోజీ!!

'పుట్టుక నీది – చావు నీది బ్రతుకంతా దేశానిది' అని
తన గళాన్ని – కలాన్ని అస్త్రంగా మలచిన మన కాళోజీ

సాహిత్య లోకానికి అగ్నిశిఖరం–
‘ఒక్క సిరాచుక్కతో లక్ష మెదళ్ళను కదిలించవచ్చ’న్న
కలం యోధుడు మన కాళోజీ!!

అందుకే ఓ కవిపితామహా...!
మీ జన్మదినాన్ని తెలుగు భాష దినోత్సవంగా జరుపుకొంటూ
వరంగల్ హెల్త్ యూనివర్సిటీకి మీ పేరు పెట్టుకుని
కృతజ్ఞత తెలుపుకొంటూ అశ్రునివాళి అర్పిస్తున్నాం
సాహిత్య సవ్యసాచి మీకు!!

*(కాళోజీ వర్ధంతి సందర్భంగా రాసిన కవిత)*

# అమ్మ కోసం...

❖

ఎప్పుడో అమ్మ కొట్టినపుడు ఏడ్చిన గుర్తు
అదీ తెలిసి కాదు
తోటిపిల్లల్లా బాల్యాన్ని అనుసరించానంతే!
అయినా... బదులు దొరికేది
ఆ పసిరెప్పల చెమ్మకు!

ప్రతి కన్నీటి బొట్టుకు
రెట్టింపు లెక్క చెప్పేది అమ్మ
ఓదార్పుగానో... ఒడి చేర్పుగానో...
ముద్దులతోనో, ప్రేమతో ముద్దలతోను...
కొట్టిందెవరైనా బదులు అమ్మదే!

ఇప్పుడు...?
కళ్ళు పొడిగా... పొడి పొడిగా
తడిగా... తడితడిగా
ఒక కన్నీటిచుక్క రెప్ప దాటదు
నా భావోద్వేగాల్ని రచ్చకీడ్చదు
లోలోపలే సముద్రగర్భంలా...

మాటలన్నీ కెరటాలై ముంచెత్తే వేళ
ఎదరుదెబ్బల గాయలను మాన్పించే ప్రయత్నంలో
ఒకసారి ఒంటరితనం
ఒకసారి నిశ్శబ్దం
ఒకసారి ఆకాశమంత నిర్మలం
మరొకసారి ఆవేశం

అయినా...
ఒక కన్నీటి బిందువైనా
కనుకొలుకులు దాటి నోట జారదు
మృదుమెత్తని రెప్పలమాటున
చెప్పుకోలేని భూకంపం
నా కన్నుల్లో కదిలే
ప్రతి తడి రేణువూ ఒక సునామీ!

అమ్మ లెక్కకోసం వెతుకుతూ...

అలాగే...
కొన్ని నా మనస్సు చూపునకు వెనుక...
మరికొనిసార్లు ముందు...

*(మాతృదినోత్సవం సందర్భంగా రాసిన కవిత, ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురణ)*

# అమ్మ ఎక్కడికీ వెళ్ళదు

❖

మా మనసులు తడిసిపోతున్నాయి
ధారలు ధారలుగా కురుస్తున్నాయి
అమ్మ వెళ్ళిపోయిందని తల్లడిల్లిపోతున్నాయి
ఈదురుగాలికి చెల్లాచెదురవుతున్న పిచ్చుకగూడులాగా
లోలోపలే దిగులు దిగులుగా కుమిలిపోతున్నాయి...

అంబరమంత సంబరంగా నోముకుని
ఆత్మీయత పంచిన అమ్మ ఆలన పాలన
ఇక లేదని తెలిసి
మా మనసులు నిలువునా బీటలు బారిపోతున్నాయి

మనపిచ్చి కాని అమ్మ ఎక్కడికి వెళ్తుంది?
అమ్మ మనచుట్టూనే ఉంటుంది
మనల్ని చుట్టుకునే ఉంటుంది
మనల్ని కనిపెడుతూ
మన మెతుకులో మెతుకై
వాతాపి జీర్ణం అంటూ
ప్రేమగా కడుపు తడుముతూనే ఉంటుంది

ఆకాశంలో ఉన్నా
మనల్ని చూస్తూనే ఉంటుంది
గాల్లో ఉన్నా
మనల్ని తాకుతూనే ఉంటుంది
మబ్బుల మంచె మీద కూర్చుని
మనందరి బతుకు పంటకు కాపలాకాస్తూ
వడిసెల విసురుతూనే ఉంటుంది
ఏ నడిజాములోనో చుక్కల్ని వెంటేసుకుని
మన ఇళ్ళచుట్టూ రక్షణగా వెలుగురేఖల్ని గీసి వెళ్తూనే ఉంటుంది

కురిసే వానజల్లులో
చల్లని పిలుపు మన అమ్మే!
విరిసే పూల నవ్వులో
మమతల మకరందం మన అమ్మే!
మనకు తెలీదు కాని
ముత్యాల కిరణాలను కొంగునిండా నింపుకొని
మన గుమ్మాల ముందు గుమ్మరించిపోయేది మన అమ్మే!

అమ్మ లేకుండా బ్రతకడం నేర్చుకోమని చెప్పడానికి
ఏ కొండచాటుకో వెళ్ళి ఉంటుంది కాని
అమ్మ ఎక్కడికి వెళ్తుంది
బొమ్మలు కావాలని మారాం చేసే మనపిల్లల కళ్ళలో
మెదిలేది అమ్మ బొమ్మే కదా!
తొలిపొద్దు వెలుగులో
చిగురాకుతో ముచ్చట్లు చెప్పే మంచుబొట్టు నీడలో
మనల్ని దీవిస్తున్న అమ్మ కదలుతూ ఉంటుంది

అమ్మ వెళ్ళిపోయిందని
వాన నీటికి తడిసిన మట్టిగోడలా

లోలోపలే కొంచెం కొంచెం పెళ్లలు పెళ్ళలుగా విరిగిపోతున్న
మనసుల కన్నీటి పొరలమధ్య కనలేకున్నాం గాని
అమ్మ మళ్ళీ వచ్చింది మనింట్లోకే మహాలక్ష్మిలాగా!!

అమ్మ ఎక్కడికి వెళ్తుంది?
మహా అయితే
తాను పంచిన రక్తంలోకే తిరుగు ప్రయాణం కట్టి
వైశాలిని మహాలక్ష్మిలా
మనింట్లోనే మళ్లీ అడుగుపెట్టింది!!

*(మాతృదినోత్సవం సందర్భంగా రాసిన కవిత, , ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురణ)*

*-ఆంధ్రజ్యోతి, 13-05-2018*

# నా మనసే ఒక వాక్యం

❖

ప్రతి వాక్యం (నా మనస్సు) ప్రయత్నం
వాక్యం చివరలో పూర్ణబిందువు
అది ఒక తెచ్చుపెట్టుకున్న నిట్టూర్పు!
దు:ఖం అంతటితో అయిపోతోందనుకోవడం
ఒట్టి పేరాశ!

నీళ్ళలో పడిన ఉప్పురాయిలా
పదాల ప్రవాహంలో పడి
వాక్యం (నా మనస్సు) రోదిస్తుంటుంది!
విరామచిహ్నాలు దాని వెక్కిళ్ళు
చెప్పదలిచింది ఏమిటో చెప్పకుండానే
ముగిసిపోవాల్సుంటుందని
వాక్యానికి (నా మనస్సు) ముందే తెలుసు!

తను చెప్పదలిచింది చెబితే వినరని
ఎవరు వినదలిచింది వారికి చెపితే వినేలా
చెప్పడానికి తగిన పదాలకోసం
వాక్యం (నా మనస్సు) వెదుకులాట ఎప్పటికీ తీరదు!

ఆమోదం కోసం ఎదురుచూడటం
వాక్యానికి (నా మనస్సుకు) వున్న సనాతన శాపం

అదెలాగంటే...
జాతర సందడిలో అమ్మ వేలువిడిచి తప్పిపోయి
బిక్కమొఖంతో దిక్కులుచూసే పాపాయి వంటిది
నా మనస్సు

అందుకే...
తనలో తెలిసీతెలియని మనసు పొరల్లో దాగున్న గతస్మృతి
పూర్తిగా తనదై అస్పష్టం...
అనాకారమైన దీర్ఘ నిట్టూర్పు...
అది పంటల కాలంలో పగుళ్ళువారిన
రాయలసీమ నేల కాదు
ఇంకిపోయిన నా గుండె ఫ్లస్ గొంతుక!

కేవలం చెమ్మగిల్లిన కళ్ళతో చూసే
మనస్సున్న అమ్మ కావచ్చు
భుజం మీది చెర్నాకోలతో తనను
తాను బాదుకునే నాన్న కావచ్చు
మనసు పొరలు చిట్లి
తనమీద పడిన చర్నాకోల అంచుల మచ్చలకు
అర్థాలు వెదుక్కుంటూ బాధగా తిరుగుతున్న
నా మనస్సు కావచ్చు
లేదా అది పద్మాక్షమ్మ ఆలయావరణంలో
పెళ్ళిచేసుకొని కాపురం చేయని
ఒక రావిచెట్టు వేపచెట్ల సంభాషణ కావచ్చు
ఆలయ ప్రాకారం గోడల మీద మసక చీకటిలో కూర్చుని
అటుగా వచ్చిన అయ్యగారికి

తలొంచి నిలబడాలా వద్దా అని సందేహపడుతున్న
ఒక చదువుకున్న శూద్రుని నీడ కావచ్చు

ఎలా పుట్టాలో
ఎలా బ్రతకాలో
ఎలా మరణించాలో
శిక్షణ పొందకుండానే పుట్టి, బతికి, మరణించి
తృప్తి కలగక ప్రాయశ్చిత్తం కోసం
మళ్ళీ మళ్ళీ పుట్టాలని చేసే ప్రయత్నం...

అస్పష్టంగానే అనాకారంగానే మిగిలిపోయే
కీచురాయి రొద నా మనస్సు రొద
మనస్సున్న మనుషులకు
ఇట్టే తెలిసిపోయే పొదుపు వాక్యం...

*(సగటు భారతీయ స్త్రీ ఆవేదనను వర్ణిస్తూ రాసిన కవిత)*

# మాతృశ్రుతి

❖

నిరాశలో నిట్టూర్పులతో
నా మనసు మూగరోదనతో నిశీధిలో తిరిగే వేళలో
ప్రతిక్షణం నీ జ్ఞాపకాలతో సతమతమవుతూ
ఆరోజు నీవు చెప్పిన వీడ్కోలు మదిలో మెదిలి
చెమ్మగిల్లిన కళ్ళతో నీవు గుర్తుకురాగా
నీవు తలలో వేళ్ళతో దువ్వుతూ
అన్నలు, చెల్లెలు, తమ్ముళ్ళు, అక్క అందరిని ఒప్పచెప్పిన
ఆ క్షణం నన్నిప్పటికీ వెంటాడుతూనే వుంటుంది

నా కంటికి ఆరోజు నువ్వు
ఓ గోమాత మేతకు వెళ్తూ
తోటి ఆవుకు తన లేగదూడను అప్పజెప్పిన చందంగా తోచింది
ద్రవించే హృదయంతో చెప్పిన ఆ మాటలు ఆ రూపు
ఇప్పటికీ నా హృదయంపై చెక్కుచెదరలేదు

చేతి నిండా గాజులతో మెరిసిపోతున్న
నీ చేతిని తడిమిచూసుకున్నాక గాని
నేను నమ్మలేదు నీవు లేవని...

ఉలిక్కిపడ్డ ఆ క్షణం
ఇప్పటికే నన్ను కలవరపెడుతూనే ఉంది.
అమ్మా!
నిశ్శబ్దంగా నువ్వు నిద్రిస్తున్న సంగతి మరిచి
అమ్మ నాకోసం ఎదురుచూస్తూ
ఏమేం చేసిపెట్టిందో అని ఆత్రుతపడుతూ వచ్చిన నాకు
పరాయివాళ్ళ ఇల్లులా చూసి చూడనట్లు
భారంగా అడుగులువేస్తూ
గుండె బరువుతో కళ్ళనీళ్ళ పర్యంతమై తిరిగివెళ్తున్న
మరలి మరలి చూస్తూ తమ్మునింటికి...

*(మాతృదినోత్సవం సందర్భంగా రాసిన కవిత, ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురణ)*

## నాన్నా... ఓ నాన్నా!

నాన్నా... ఓనాన్నా...
నా మనస్సు అనే తెల్లకాగితంపై
నా కవి హృదయం పొంగించి
మీ ఆత్మీయతనే నా కలంలో సిరాగా నింపి
ఒలికించి కవితగా మలిచిన ఓ భావం!

మీ వ్యక్తిత్వం
పర్వతంలా గంభీరమైన
పగదారుల పెనుగాలి తాకిడికి
మీ ఆత్మస్థైర్యం కోల్పోకుండా
ఆకాశంలా నిర్మలత్వం ప్రదర్శించిన ఓ నాన్నా!

మా చిరువిజయాల తాకిడికే వర్షించేను కదా
నీ హస్తాల అభినందన వర్షం మా పైన!
నీ జీవనంలో కారుచీకట్లు కమ్మినా
పట్టువదలి విక్రమార్కునిగా
జీవనమజిలీలు దాటుతూ
మా బ్రతుకున చిరుదీపాలు వెలిగించారు.

అందుకే
మా మమతానురాగాల మాలికల మధ్య
భావనల తోరణాలతో నిస్వార్థరాగాలతో
మా హృదయ మౌన సంగీతంతో
కోటి ఊహలకు రూపం ఇచ్చిన
మీ దీవెన
మా జీవితానికి పెట్టని కోటగోడ నాన్న!

వసంతంలో అతిథిలా
మా అంతరంగంలో నిలుపుకొంటాము నాన్న!
మీ ఎదను పరికించి
వికసించిన హృదయ పుష్పం ఈ కవిత నాన్న

మీలోని భావుకతకు శృతి కలిపిన
మ్రోగును మా మనస్సు
నా కరుణాతరంగ మాలికలు
ఈ అక్షర కుసుమాలే
మీ మెడలో మాలికగా వేస్తున్నాను నాన్నా!

*(పితృదినోత్సవం సందర్భంగా రాసిన కవిత, ఈనాడు దినపత్రికలో ప్రచురణ;*
*ఉత్తర అమెరికా వారి 'నాన్న ఘనుడు – త్యాగధనుడు' శీర్షికలో విశిష్ట బహుమతి పొందిన కవిత)*

# నేను రక్షకభటురాలిని!

❖

విద్వేష తిమిరాన
విమల ప్రేమ జ్యోతిని
నేను రక్షకభటురాలిని!

కాటిన్య లోకాన కారుణ్య దీప్తిని
దౌర్జన్య జగతిలో దయార్థ సింధుని
సంక్షుభిత ధరణిలో శాంతి దీపాన్ని
నేను రక్షకభటురాలిని!

అబలను కాను
మానవత్వాన్ని చాటుతున్న మహనీయమూర్తిని
మానవాళి కెల్ల మహిత స్ఫూర్తిని
నేను రక్షకభటురాలిని!

మగ మృగాలను మట్టికరిపించినదాన్ని
ముట్టి విరిచినదాన్ని
కొండలు ఎక్కిన దాన్ని
కొనలు దాటిన దాన్ని

అమావాస్య చీకటిలో
అడవిలో షికారు చేసిన దాన్ని
ఇనుప తుపాకీతో
ఈటే కట్టెతో రాజ్యం చేస్తున్న బెబ్బులిని
మేఘంలా ఉరుముతూ
మెరుపులా మెరుస్తూ
కడలిలో కెరటంలా కదులుతూ
కదనానికి దూకిన
నయాగరా జలపాతాన్ని
శక్తులన్నీయు కూడి స్త్రీ శక్తిగా మారిన చైతన్య దీప్తిని
సౌమ్య సస్య శాంతి గీతం రచించి
నిత్యస్ఫూర్తిగా నిలిచిన
నేను రక్షకభటురాలిని!

మానవత్వం మరచిన సౌహార్దత లేని కీచకులను
కళ్ళతో ఉరుముతూ కేకలతో పిడుగులు కురిపిస్తూ
పిచమనిచిన దాన్ని –
అర్ధరాత్రి అపరాత్రి అనకుండా
పొలిమేరల శాంతిభద్రత లు కాపాడుతూ
కాపు కాచే పోలేరమ్మను
పోచమ్మను నేను!
సూర్యుని ఒక కన్నుగా చంద్రుని రెండో కన్నుగా
తెలివిని మూడో కన్నుగా
ఒళ్ళంతా కళ్ళు చేసుకుని
పహారా కాస్తున్న ఇంద్రకంటిని
ముక్కంటిని!!
చూపులతో శాసిస్తూ అవయవాలను
ఆయుధాలుగా మలచిన దాన్ని
నవ నాగరికతకు నడకలు నేర్పుతున్న నిత్యాన్వేషిని

స్వేచ్ఛా జీవిని
నేను రక్షక భటురాలిని!!

నవ సమాజ స్థాపనకు
నడుంబిగించిన నారీమణిగా
నా ప్రతి పథం–
ప్రగతి రథంలా నడిపిస్తూ
పాంచజన్యం పూరిస్తున్న
ప్రత్యక్ష పార్థసారథిని
పారా హుషార్...
నేను రక్షక భటురాలిని!!

*(కరోనా సమయంలో మహిళా పోలీసుల కవిసమ్మేళనంలో రాసిన కవిత...)*

# 'కరోనా' భూతమా...

❖

కరోనా భూతమా... కంటికి కనిపించని ప్రేతమా...
నీతో మాకు యుద్ధం మొదలయ్యింది
ఈ యుద్ధంలో గెలవడానికి
మా శక్తి యుక్తులన్ని వొడ్డి పోరాడుతాం
అంతిమ విజయం మా మానవాళిదే

నీవు మమ్మల్ని పడగొట్టాలని ప్రయత్నించినా
పడిలేచే కెరటంలా
నిగ్రహంతో యుద్ధం చేసి నీ అంతు చూస్తాం
నీవు మా మానవాళికి
ఎంత ముప్పు తలపెట్టినా
మా మనుగడనే స్తంభింపచేసినా
నిన్ను నియంత్రించే మేధావులు ఉన్నారు మా భారతదేశంలో.
ఇక నీ ఆటలు సాగవని తెలుసుకో

నిన్ననే మా సోదరి 'మినాల్ భోమ్ స్లే'
నీ జాడ కనిపెట్టె కిట్టును
ప్రాణాలకు తెగించి తక్కువ ఖర్చుతో కనిపెట్టినారు

దీనితో నీ వ్యాప్తిని నియంత్రించుతాం

నీవు ప్రవేశించిన శరీరం నుంచే
"ఆంటీ బాడీస్" తీసుకుని వ్యాక్సిన్ తయారుచేసి
"నీ వేలితోనే నీ కన్ను పొడిచే" ధన్వంతురులున్నారు
మా దేశంలో ఇది జగమెరిగిన సత్యం–
ఇదే నీ మీద ప్రయోగించిన తిరుగులేని అస్త్రం

దిష్టిమాంత్రికుడిలా నీవు మా గుమ్మం ముందుకు రాగానే
నిన్ను కర్పూర కళికలతో కాల్చివేస్తా తెలుసుకో–
మా సంస్కృతి, సంప్రదాయాలలోనే సైన్స్ ఇమిడి ఉన్నది.
దాన్నే ఆయుధంగా చేసుకొని
ఈ యుద్ధలో గెలవటానికి
రోగనిరోధక శక్తిని– మనోశక్తిని పెంచుకొని
వజ్ర సంకల్పంతో పోరాడుతాం
విజయం సాధిస్తాం–

ధన్వంతరి వారసులు...
ధరణిలోన దేవతలు మా వైద్యులు
శక్తివంచన లేకుండా
కంటికి రెప్పలా కాపుకాచే రక్షకభట కిశోరాలు–
నిత్య నవ్యతా శుభ్రతా జ్యోత్స్నలా వెల్లివిరిపింపచేస్తున్న
పారిశుధ్య కార్మిక గ్రామ దేవతలు–
నిన్ను నియంత్రించే వ్యాక్సిన్ అభివృద్ధి చేసే
ఆరొగ్య ప్రధాతలైన సైంటిస్టులు–
'శతమానం భవతి శతాయుష్ రేంద్రే ప్రతి తిష్టతి' అని
దీవించే మా పెద్దలు–

మా ప్రకృతిమాత మబ్బుల మంచె మీద కూర్చోని

మా మానవాళి బ్రతుకపంటకు కాపలాకాస్తూ
వడిసెల విసురుతున్నంత వరకు–
ప్రొద్దునే ఉదయశ్రీ అరుణారుణ కిరణాలు
మా మీద ప్రసరింపజేసి
మాలో వ్యాధినిరోధక శక్తిని పెంచే
సూర్యభగవానుడున్నంతవరకు –
మా జాబిలమ్మ
ఏ నడిజాములోనో చుక్కల్ని వెంటేసుకునివచ్చి
మా యిండ్ల చుట్టూ రక్షణగా
వెలుగురేఖల్ని గీసి వెళ్తున్నంతవరకు
నీవు మమ్మల్ని ఏమి చేయలేవు కరోనా

ఈ క్షణంలో
ఇదే మా జీవన్మరణ సమస్య
ఇక మా పోరాటం ఆపం
ఇకనైనా
నిప్పుతో చెలగాటమాడితే
నిలువునామాడి మసైపోతావని తెలుసుకో.....
తెలుసుకో కరోనా!...

*(కరీంనగర్ డి–10 చానెల్ నిర్వహించిన కవిసమ్మేళనం సందర్భంగా తృతీయ బహుమతి పొందిన కవిత)*

# అమరజీవి అబ్దుల్ కలాం!

❖

ఓ అబ్దుల్ కలాం మహాశయా!
రాష్ట్రపతిగా మా దేశానికి సేవలు అందించిన చరిత్ర

చదివిన మేధావులు మీరు
సూర్యునికి ఉన్న తేజోవంతం వెలిగే కాంతిని వెదజల్లే
ప్రశాంతతత్వం మీ తత్వం
మీ సహజత్వం మానవత్వానికి మీరిచ్చే ఉపదేశం.
మీ నిస్వార్థ సేవాతత్వం సమతా మమతా మానవతకు సందేశం

నేటితరం పనితీరు పైన ఇస్రోలో చైతన్యం తెచ్చి
మన దేశ ఘనతను చాటి చెప్పిన ఘన కీర్తులు మీరు

సాటి వారితో స్నేహంగా అయిన వారితో
ఔదార్యంగా మీకన్నా మిన్న ఎవరూ లేరని
దేశానికి సేవలందించిన సేవా తత్పరులు మీరు.

పోలియో వచ్చిన పిల్లలకు
తేలికైన కాళ్లు సమకూర్చిన ధన్వంతరులు మీరు .

కలలు కనండి కలని సాకారం చేసుకోండి అని
విద్యార్థులకు భవిష్యత్తుకు బాటలు వేసి
భారతరత్న అని వందనమొకటి అందుకున్న
భారతమాత ముద్దుబిడ్డ మీరు!

వంచన ఎరుగని మనసుని తెలిపి
ప్రేమ త్యాగం జనులకు పంచి
లోకం పోకడ గమనించి
సర్వేజనా సుఖినోభవంతు అని
అందరిపైనా అభిమానంగా
మీ బ్రతుకును సార్థకం చేసుకున్నారు.
దాన త్యాగ గుణాలలో రాణించి
మనుగడ సాగించి
కీర్తిని గడియించిన ఉత్తములు మీరు

అందుకే ఓ మహానుభావా!
శుభోదయ సూర్యుడిలా
మా మదిలో
నిత్యం ఉదయిస్తూనే ఉంటారు.

*(అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా...)*

# తెలుగు వెలుగులు

❖

తెలుగు పుడమిలో
ప్రశాంత భావసముద్రం తెలుగు
తెలుగు నింగి ఒడిలో
ఉషోదయ భానుకిరణం తెలుగు
హరివిల్లు మీటితే పలికే
మధుర భావ తరంగం తెలుగు
హృదయవనంలో వికసించిన
పరిమళపద సుగంధకుసుమం తెలుగు

మనసు పలికే మధురమైన
భావనల నాదం తెలుగు
వసంత ఋతువులో
కోయిల పాడే మధురగానం తెలుగు
వసంతసీమలో వీచే
సుగంధ మధురోహల గానం తెలుగు
భారతమాత మెడలో శోభిల్లే
సుమధుర మందారమాల తెలుగు

దేశభాషలకెళ్ళ లెస్సయని
ఘనకీర్తినొందె నా తెలుగు

తెలుగుతల్లి వెలుగు నేత్రాలు
ఆది పద్యకవి నన్నయ...
సుసంపన్నం చేసి తెలుగు వెలుగు కవి గిడుగు
వీరి కిరణశోభతో వెలిగే
జగతిన తెలుగు కీర్తి కాంతిరేఖలు

*(తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రాసిన కవిత)*

# యాదాద్రి శిల్పకళా వైభవం

❖

అహో...
ఏమి అద్భుతం! ఏమి అద్భుతం...
మహా మహాద్భుతం!!
యాదాద్రి శిల్పకళాసౌందర్యం పరమాద్భుతం!!!

యాదాద్రి తేజోవిలాసం
చూచినకొలది చూడాలనిపించే శిల్పకళా చాతుర్యం
మన తెలంగాణకు యాదాద్రి తలమానికం
అమరశిల్పి జక్కన్న వారసుల్లా
సృష్టికే ప్రతిసృష్టి చేసినారు
ఈ శిల్పకళా బ్రహ్మలు

యాదాద్రికి గత చరిత్ర పూర్వవైభవం
కన్నుల పండుగగా కానవస్తున్నది
ఈ శిల్పకళాతోట అద్భుతం... అద్వైతం...

పచ్చల పగడాలతో, వజ్రవైఢూర్యాలను
రత్నకెంపులను పొదుగుకొని

నవరసాలొలికిస్తూ నడిచొచ్చే శిల్పాలు...

ఈ అపరబ్రహ్మలు యాదాద్రికి నలుదిక్కుల
విశ్వకర్మవోలె శిల్పులు
శిల్పరత్న విశ్వకర్మ ప్రకాశం
యుక్తి కల్పతరు - శిల్పదర్శనం
చిత్రకల్ప - అలంకారశాస్త్ర
పలు శాస్త్రముల మేళవించి
తమ శిల్ప చాతుర్యాన్ని చాటుతూ
శిల్పాలు చెక్కిన తీరు అద్భుతం అమోఘం

కళలకు కాణాచి ఈ యాదాద్రి అని
వైకుంఠమును విడిచి
ఇల యాదాద్రిలో
అమ్మవార్లతో
కొండపైన కొలువైనాడు ఆ లక్ష్మీనరసింహస్వామి
ఆనందంగా

అద్భుతం!
విశ్వమంతటిని కాపాడుతూ
కోరినవారికి కొంగుబంగారమై
జ్వాలా నరసింహుడై...
గండభేరుండ నరసింహుడై
ధ్యానంలో నిమగ్నమై యోగానంద నరసింహుడు
భక్తులు కోరిన కోరికలు తీర్చుతూ
ప్రహ్లాదుడు కొలిచిన స్వామియై
ఈ యాదాద్రిన వెలిసి అలరిస్తున్నారు

అందరి నిరంతర శ్రమ ఫలితమే

యాదాద్రి శిల్పకళాతోరణం

విశ్వకర్మల కృషి అభినందనీయం
కళలకు నెలవై
సప్తస్వరాలు శ్రవణం గావిస్తూ
ఈ శిలలు పలుకరిస్తూ
మనసుల్ని పులకిస్తున్నవి!

అరిషడ్వర్గాలను జయించిన
నా తనువు, మనస్సు
ఈ స్వామికే అంకితం
యాదాద్రి లక్ష్మీనరసింహస్వామికి
ఇదే
నా అక్షర నీరాజనం!!

*(యాదాద్రిలో శిల్పకళానైపుణ్యతలను చూసిన పరవశంలో...)*

# తేనెలూరు తెలుగు

❖

రాయలు మెచ్చిన భాష
రాజసం ఉన్న భాష
గిడుగు తెచ్చిన భాష
మన తేట తెలుగు భాష
పసిడి పలుకుల భాష
పరులు మెచ్చిన భాష
ఎనలేని కీర్తిగొన్న భాష
మన తేట తెలుగు భాష
గోరు ముద్దల అమ్మ భాష
నీతికథల తాత భాష
మురిపాల బొమ్మ భాష
మన తేట తెలుగు భాష
అందరమైన అక్షరాల భాష
నాణ్యమైన నానార్థాల భాష
నవనాగరికత నేర్పిన భాష
మన తేట తెలుగు భాష

*(తెలుగు భాష దినోత్సవం సందర్భంగా రాసిన కవిత)*

# కరోనా సమయంలో మహిళల పాత్ర శ్లాఘనీయం

❖

ఓ మహిళ
కరోనాని కట్టడి చేసే నీ ప్రయత్నం శ్లాఘనీయం.
ఓ మహిళ ఆత్మీయతతో
అమృతతుల్యమైన ఆహారాన్ని అందిస్తూ
వ్యాధి నిరోధక శక్తిని పెంచుతూ
కరోనాని కట్టడి చేసే
ఓ మహిళ మీసేవ  ఆపూర్వం
వైద్యో నారాయణో హరి అన్న నానుడి నిజం చేస్తూ
అమ్మ మనసుతో చేసే మీ సేవ సేవాతత్పరతకు
మా అందరి పాదాభివందనాలు.
కరోనాని నియంత్రిస్తూ మాన ప్రాణ రక్షణే ధ్యేయంగా
సమాజ రక్షణలో తన స్వీయ రక్షణలో తనను కూడా మరిచి
అహర్నిశలు కాపు కాస్తున్న రక్షకభటురాలిగా
మీ శ్రమ అజేయం అద్వితీయం
కరోనాని నియత్రించే వ్యాక్సిన్లను కనిపెట్టే
పరిశోధకురాలుగా మీ కృషి అద్భుతం...

ఆన్లైన్ తరగతులు నిర్వహించి విద్యార్థుల చదువులను
ముందుకు నడిపిస్తున్న ఉపాధ్యాయురాలిగా
మీ విద్యాబోధన అభిలషణీయం...
రేపటి తరానికి నగిషీలు చెక్కే నేర్పు
మీ జీవితంలో సవాళ్లను ఎదుర్కొనేలా తీర్చిదిద్దే
ఒడుపున్న బొమ్మగా
స్త్రీజాతికే నీవు మకుటాయమానం
మనోధైర్యాన్ని కోల్పోయిన కరోనా బాధితులకు మీ మాటలు
ధైర్యాన్ని నూరిపోసే మనోవికాసకురాలిగా
మీ వాక్పటిమ అభినందనీయం...
స్వాలంబనకూ  ఊతమిస్తూ జన విస్ఫోటనం కాకుండా
ప్రజలు ఆకలి కేకలు వేయకుండా
సకల సదుపాయాలు  సమకూర్చే సంఘసేవకురాలిగా
మీ  కరుణ, అప్రమత్తత కమనీయం
పరిశుభ్రతే పరమావధిగా స్వీయరక్షణను మరిచి
ప్రజారోగ్యమే తన ఆరోగ్యంగా భావించే
పారిశుద్ధ్య కార్మికురాలుగా
మీ కృషి అజరామరం
అందుకే ఓ మహిళలు
మీరు స్త్రీజాతికే మణిదీపికలు
నిత్యస్మరణీయులు...

*(అక్షరయాన్ కవిసమ్మేళనంలో కరోన సందర్భంలో మహిళల పాత్ర సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో చదివిన కవిత)*

# సహజకవి పోతన

❖

'పలికెడిది భాగవతమట
పలికించెడివాడు రామభద్రుండట...' అంటూ
భాగవతానికి శ్రీకారం చుట్టారు

సంస్కృతంలో నుండి తెలుగులోకి
భాగవతాన్ని అనువాదం చేసిన ఘనత మీది
పండిత పామరులను అలరించిన
ప్రజాకవులు మీరు

భోగినీ దండకం,
వీరభద్ర విజయం, నారాయణ శతకం రచించి
భోగినీ దండకం సింహభూపాల రాజుకు అంకితమిచ్చి
నరాంకితం అయినందుకు ఆవేదనపడ్డా
రాముడు భాగవతాన్ని రాయమనగా
వ్రాసి రామభద్రుడు అయినారు

ఓ పోతనామాత్యా
మీ భాగవతాన్ని త్యాగయ్య నిత్య పారాయణంతో

రామదాసు పూజ కుసుమంగానూ
భక్తి మార్గదర్శనం గావించారు

భక్తి పాండిత్యం, వినయం,
విచక్షణ వచన, రచన విలాసంలో
మాధుర్యం కొట్టొచ్చినట్లు కానవస్తుంది

మీ రచనల్లో
వీరభద్ర విజయంలో మంగళసూత్ర బంధం
మహాద్భుతం

ఇతర కావ్యాల్లో దశమస్కంధం
కృష్ణలీలామృతం
నైమిశారణ్యం సువర్ణ కలశాలు
ఆటవెలది ఛందస్సు కాంతికిరణాలు
అమ్మల గన్న యమ్మ
ఊరక రారు మహానుభావులు–
సిరికింజెప్పడు జోఅచ్యుతానంద
మీ రచనాశైలి
ఆదిశంకరాచార్య శైలిని పోలి ఉంటుందని అంటారు

తెలంగాణ వరంగల్‌లోని
బమ్మెరలో జన్మించినట్లు మీరు
సేద్యం చేసిన భూమి
మోటకొట్టిన బావి
మీ సమాధి
మీరు తెలంగాణ కవులు అనడానికి
నిదర్శనం.

వేదాంత వివరణలతో
"శ్రీధరీయ వ్యాఖ్య"
మీ పాలిటి సుభిక్ష!

మీ పద్యాలు
మధురాక్షర సమ్మేళనాలు
తెలుగువారి నోటికెక్కింది
హృదయ కోటికెక్కింది

'కమలాక్ష నర్చించు కరములు కరములు' అను పద్యం
ఆవుపాల ముంతలో
పైకి తేలిన నురగపుష్పం!

పామరులకు కూడా పరమాత్మ తత్వాన్ని బోధించిన
పోతనామాత్యా!
మీ పద్యాలు
యావత్ భారతీయ హృదయాల్లో
సువర్ణచిత్రచ్ఛవులు
'ఊరక రారు మహాత్ములు' అన్నమాట
లోకోక్తిగా మారింది.
చదివి తినే చదువులలో మర్మమెల్ల –
సందేహము–
మన్ను తినంగనే శిశువునో వెఱ్ఱినో అన్న మీరు
ఇజం ఎరుగని ప్రజా కవులు

అంత్యప్రాసల దరువుల్లాగ
శ్రవణసుఖాన్ని కూర్చిన కూర్పులివి
పంచేంద్రియాల సంపుటిలో శబ్దగుణం
తనువుకు స్పర్శ గుణం

నయనాలకు రూపగుణం
జిహ్వకు రసగుణం
నాసికకు గంధగుణం
పంచేంద్రియాల సహజగుణం తెలిసిన
సహజ కవులు మీరు.

రామానుజుల భక్తి మార్గదర్శకంగా
భగవదనుగ్రహం కోసం
శరణాతి తప్ప మరొక మార్గం లేదన్న భక్తివర్యులు మీరు
కవిత్వం మీకు కైవల్య సాధనం
సర్వమానవ హృదయాంతరాలలో
భక్తి ప్రసూనాలను పరిమళింపజేసే
సాహిత్య కల్పవృక్షం 'భాగవత పురాణం'

రాజుల నీసడించి
రాముణ్ణి ఆశ్రయించి భోగాలను గర్వించి
భగవంతుని కీర్తించిన పోతనామాత్య...
మీ జీవితం
ఉత్తమ మానవతకు
ఉజ్వల మణిదర్పణం!!

*(పోతనా మాత్యుని జయంతి సందర్భంగా రాసిన కవిత)*

# జ్ఞాన కరువు –
# తీర్చు కల్పతరువు గురువు

❖

వివేకం లేని విద్య గురువు నేర్పని విద్య గ్రుడ్డి విద్య
అజ్ఞానం నశింపచేసి విజ్ఞానానందించి జ్ఞానికి దారి
చూపువాడు గురువే–
మంచిని పెంచి మానవతను చాటువాడు గురువే–
భగవంతుని దర్శింపజేసే జ్ఞానజ్యోతి గురువే
అజ్ఞానాన్ని హరించి జీవితాలకి అర్థాన్ని ప్రసాదించే ఆత్మీయ
బంధువు గురువే
మన సంసార సముద్రానికి దారి చూపే చుక్కాని గురువే
మనిషిలో అంతర్లీనంగా మార్పునిచ్చే మనోవికాసి గురువే
వ్యక్తిని సంస్కరింపజేసి సమాజాన్ని సంస్కారపథంలో
నడిపిస్తూ ఉత్తమమైన గమ్యాన్ని నిర్దేశించే సంస్కర్త గురువే
విజ్ఞానసారం అందించి దివ్యత్మాన్ని ప్రభాతించే గ్రంథం
విద్యలనందించే విజ్ఞాన దీపిక గురువే
బంగారు భవిత చూపే భాగ్యరేఖ – ఆదర్శములు నేర్పించే
అభ్యుదయ దర్శకులు

భవిష్యత్తును చూపించే భవిష్యవాణి గురువే
మనం మనంగా జీవించాలన్నా మనకొక గురువు అవసరం
అందుకే జ్ఞాన కరువు తీర్చు కల్పతరువు గురువు అన్నారు కదా
గుణాతీతుడు రూపాతీతుడు మంచిని చూపించే వాడే
మహితాత్ముడైన గురువు
మానవ మస్తిష్కంలో జ్ఞానజ్యోతిని వెలిగించిన
గురు ఋణాన్ని తీర్చుకుందాం మనమందరం ఈ రోజు
శ్రీ గురుభ్యోనమ:

*('గురుపూజోత్సవం' సందర్భంగా రాసిన కవిత)*

# శాంతిదూత మన చాచాజీ

❖

14 నవంబర్‌లో
పుట్టిన నెలరాజు మన నెహ్రూజీ
నవ భారత ప్రప్రథమ ప్రధాని
మన మారాజు చాచాజీ

రైతుబంధువై నిర్మించాడు
ఆనకట్టలు ఎన్నో ఎన్నెన్నో
బాలబాలికలను ప్రేమించే కనుపాప వోలె
పంచవర్ష ప్రణాళికలన్న – పంచప్రాణాలే ప్రధానిగా
ప్రజాక్షేమమే తన క్షేమం అన్న
మహనీయుడు మన చాచాజీ
బహు భాషలయందు బహు ప్రావీణ్యుడు
గులాబీలాంటి చెదరని చిరునగవే ఆభరణం అతనికి–
అకుంఠిత దీక్షాపరుడు
శాంతిదూత
సమరం సాగించిన స్వాతంత్ర్య సమరయోధుడు
తన తనయ ఇందిరా ప్రియదర్శినే

ఈతని గుండెచప్పుడు
చల్లని మనస్సున్న మన చాచాజీ చిరస్మరణీయుడు
భారతావని ప్రియతమ నేత
భావిపౌరులకు స్ఫూర్తిప్రధాత
భారత భూమికి భాగ్యవిధాత
చైతన్యమయం చేసెను దేశభవిత
ప్రగతిశీల భావకుడు
మన శాంతిదూత మన చాచాజీ–

*(భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా...)*

# మా సిరుల తల్లి మా సిద్ధిపేటమ్మ

ఎందరో రచయితలు నిను కవితగా వర్ణించి
అందాల కవితలను అలరి ప్రజలకిచ్చిరి
కమ్మటి హృదయమని కావ్యాలు వ్రాసేరు
కరుణామయివని కథలు చెప్పేరు
రచయితలు లేకున్న రచనలున్నవి నేడు
పాడుకొనుచున్నారు ప్రతిభాషలో గూడా
॥ ఎందరో ॥

సిద్ధిపేట అందాలు తిలకించి వ్రాశారు
కోమటి చెరువులోని క్రొంగొత్త అందాలు
రంగనాయకసాగర్‌ల రమణీయకాంతుల
ప్రకృతిని – పడతులను చిత్రంగ చిత్రించిన
నెల్లుట్ల రమణల– రుస్తుంల
కలువలను – కన్నెలను కమనీయ దృశ్యాల
కాపు రాజన్నల– బాతిక్ బాలన్నల
అపురూప చిత్రాలు కనువిందు చేయగ
గొల్లభామల చీరల ఘనమైన కీర్తి
॥ ఎందరో ॥

అటులనే కవులతో  అలరి ప్రక్రియలలో
గీతాలు వ్రాయించి కీర్తి గావించితివి
చిరకాలమున నిన్ను కీర్తించెదరు జనులు
మహనీయ భావములు మనసునందు మెలగ

॥ ఎందరో ॥

కవితలే గద నీదు కనమనీయమగు సృష్టి
కవులే కద– శాశ్వతము కాలగర్భమునందు
నీతోని పయనించు నిఖిల శాస్త్రములన్ని
కవులు రచయితలూనూ కమనీయ కవితలును

॥ ఎందరో ॥

ఎందరో రచయితలు నిను కవితగా వర్ణించి
అందాల పెన్నిధిని యట్టి ప్రజలకిచ్చిరి
విశ్వవేదిక యందు వివరింపగను

*(సిద్ధిపేట ఘనతను చాటుతూ రాసిన కవిత...)*

# తెలంగాణ మాట మాధుర్యం

మన తెలంగాణ మాట మాధుర్యం
మంచిగంధమల్లె నా మనసును తాకినపుడు
చీకటి వెలుగుల సంధ్యారాగంలో
చిరుగాలి చిరునవ్వుల స్వరాలు పలకరించాయి
మరుమల్లెలు మధురంగా పరిమళించాయి.

మన తెలంగాణ మాట
నిశ్వాససారంలో
మోహనరాగ వాయులీనంలో
తరుల గిరుల తల్పంలో
విరుల స్వాగత గీతంలో
ప్రకృతి పారవశ్యమవుతుంది

తెలంగాణ మాట మాధుర్యంలో
జనహృదయ జ్ఞాన ఆరాధనలో
అనుభూతి కందని ఆత్మీయ భావనలో
రాగం–తానం–పల్లవి తానై
మనసుల్ని మురిపిస్తుంది

మన తెలంగాణ తల్లి నుదుటి తిలకమై
నవధాన్యాల్ని ఒడిలో పోసినపుడు
నాగరికత నింపుకున్న నగర వాకిట్లో
పల్లెసీమలు పండువెన్నెలై ప్రకాశిస్తున్నాయి
కోకిలమ్మ సమసమాజ శ్రేయోగీతం ఆలపిస్తుంది

మన తెలంగాణ త్యాగధనుల కన్నీటి స్పర్శ
యుగయుగాల వరకు
విద్యార్థుల జన హృదయ ఘోష
మన తెలంగాణ ప్రజల నోట
కవి పాడించిన పాట
శృతిలయల కవితాక్షర భాష
మన తెలంగాణ తల్లి ఒడిలో సమస్త మానవాళి
మాతృప్రేమ మధురిమలో ఒలలాడిన భాష
తెలంగాణ మాట మకరందాల ఊట
తెలంగాణ మాటలో యాసలో ఆత్మీయత ప్రతిధ్వనిస్తుంది
మన తెలంగాణ మాటకు మత్సరం లేదు
మన తెలంగాణ పాటకు మరణం లేదు
జైజై తెలంగాణ మాట
జైజై తెలంగాణ యాస
జై తెలంగాణ

*(తెలుగు భాష సందర్భంగా రాసిన కవిత)*

# గిడుగు కాదు పిడుగు

❖

గిడుగు కాదది
అగ్గిపిడుగు!
తెలుగు భాష ఉద్ధరణకై
ధ్వజమెత్తిన సమరసింహం!!

భాషా ఉద్యమ సమరంలో
వెన్నుచూపని తెలుగు ధీరుడా...
పర్వతాల పేటలో పుట్టిన పరశురాముని అంశానివా...
గ్రాంథిక మదపు మొదలు నరికిన శూరుడా...
గంగ వంశం చరిత్ర చెప్పిన చారిత్రక పరిశోధకుడా...
సవర భాషకు వ్యాకరణం చెప్పిన సరస్వతి పుత్రుడా
తెలుగు భాషామతల్లికి పుత్తడి సొగసులద్దిన పూర్ణుడా

అందుకో మా వందనం!
తెలుగు జాతి అభివందనం!!

*(గిడుగు జయంతి సందర్భంగా కవి సమ్మేళనంలో చదివిన కవిత)*

# మకరంద భాష తెలుగు భాష

❖

తేటతేట తెలుగు మన తెలుగు భాష–
దేశభాషలందు తెలుగు లెస్స
తీపితీపి తీయనైన జుంటితేనెధార మన తెలుగు భాష
అందమైన అందచందాల భాష మన అజంత భాష
అమృతధార మన తెలుగు భాషకు వందనం... అభివందనం...
సౌరభాల గుబాళింపు మన స్వచ్ఛమైన తెలుగు భాష...
హృదయం స్పందించే హృద్యమైనభాష మన తెలుగు భాష
పసిపిల్లాడు పలికే అమ్మ భాష మన తెలుగు భాష
సంగీతంలో సరిగమల మన తెలుగుభాష
పూర్వజన్మ సుకృతం తెలుగు నేలలో పుట్టటం
కోకిల సుమధుర కూజితం మన తెలుగు భాష
తెలుగు భాషనే మాట్లాడుతాం
తెలుగు భాషను దశదిశలా చాటుదాం
తెలుగుతల్లికి వందనమర్పిద్దాం
జై తెలుగు తల్లి!

*(తెలుగు భాష దినోత్సవం సందర్భంగా రాసిన కవిత)*

# ఆంగ్ల నూతన సంవత్సరమా

❖

ఆంగ్ల నూతన సంవత్సరమా
నీ రాకతో కరోనావల్ల
పాఠశాలకు దూరమైనా పసిమొగ్గలు
అక్షర కుసుమాలై పూయాలి
కరోనా మహమ్మారి
కరాళ నృత్యం చేస్తుంటే
దుఃఖ నదిలో ఈదుతున్న మానవ వృక్షం
రేపటి ఊపిరై
బలంగా నాటుకోవాలి
లాక్‌డౌన్‌లతో ఆగిపోయిన ప్రయాణాలు
ఆశల గమ్యాలు చేరాలి
ఆకలి రాగం పలికె ప్రేగుల తీగలకు
ఆహార భద్రత కల్పించాలి
క్రొత్తసాగు చట్టంపై ఉద్యమిస్తున్న రైతుకు
తెగిన రక్తనాళాలను అతికించుకుని
ఆకుపచ్చని బతుకు ఉదయసూర్యుడు అవ్వాలి

కత్తి మొన మీద
తలక్రిందులుగా తపస్సు చేస్తున్న ప్రభుత్వానికి
ప్రజాస్వామ్యం ప్రత్యక్షం కావాలి
ఏ జీవితాన్ని స్కానింగ్ చేసినా
మచ్చలేని రిపోర్ట్ రావాలి
నిరసించే దేహాలకు
రసధ్వనులు వినిపించే కోకిల గానం
ప్రగతిరథము నెక్కి పరవశించి పాడే
సౌమ్య సస్యగీతం కావాలి

ఓ ఆంగ్ల నూతన సంవత్సరమా
నీకు ఇదే మా శుభస్వాగతం

# శ్రీశ్రీ

❖

ఓ 'శ్రీశ్రీ' మహాశయా!
కవిత వ్రాయగ చేపట్టిన మీ కలం
నవోదయానికి శుభోదయం
మీ పాటలు ఉద్రేకానికి ఉత్సాహానికి
మీ మాటలు ఉత్తమ సమాజ ప్రతిష్ఠలు
మీ పద్యాలు విప్లవ ఉద్యమ శంకారావాలు
మీ ప్రవచనాలు మరో ప్రపంచ ప్రస్థానానికి
పురోగమించే పరశురామాస్త్రాలు
వస్తున్నాయి వస్తున్నాయి ప్రగతి రథ చక్రాలు
సబ్బుబిల్ల, కుక్కపిల్ల, అగ్గిపుల్ల
ఏది కాదు కవిత కనర్హం
మీ జీవితం సారథ్యానికి సంకేతానికి
సమరస భావ సందేశం
భావిభారతపౌరులకు ఆజ్యం
కవివర్యా! మీ కలం ఆగినా
మీరు అమరజీవియే పితామహా!!

*(శ్రీశ్రీ జయంతి సందర్భంగా జరిగిన కవిసమ్మేళనంలో)*

# సర్వాయి పాపన్న గౌడ్

పాపన్న...!
మీరొక సజీవ చైతన్యం...
అమ్మపిలుపులో పాపడివైనా
మొగలు తొత్తుల మదమణిచి
మట్టికరిపించిన వీరసింహం మీరు.

తెలంగాణమంతా రక్తపు మడుగైనప్పుడు
వీరకిశోరంలా మీరు పోరాడిన తీరు
మొగలుల గుండెల్లో
అగ్నిశిలలై ఫిరంగుల్లా మారుమ్రోగాయి.
మీ నామస్మరణమే
వేల గొంతుల్లో రణనినాదమై
యుద్ధభేరి మ్రోగించింది.

మీ కనుకొలుకుల్లోంచి కారిన రక్తం
వసంత మేఘగర్జనకు మెరిసిన మెరుపై
ఆకాశమంత అలుముకుని
దిక్కులు పిక్కటిల్లేలా

శత్రువుల గుండెల్ని చీల్చాయి

మీరు మేరు పర్వతమై
తెలంగాణలో విజయభావుటానెగరేసిన
ధీరులు వీరులు మీరు...!!

'కల్లుతాగి డబ్బులివ్వలేని
ధనరాశులు ఉన్న నిరుపేదలు
మొగలు సైనికులారా' అని
సరసంగా చమత్కరించిన చతురులు మీరు.
ఆడవాళ్ళ మాన ప్రాణాలు కాపాడిన
ఆపద్బాంధవులు మీరు

అందుకే పాపన్న
మీరు అమరజీవులన్న!!

*(సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా రాసిన కవిత)*

# భారతదేశం పవిత్ర దేశం

❖

**భా**రతదేశం అతి సుందర దేశం
భారతదేశం అతి పవిత్ర దేశం
భారతదేశం సకల సంస్కృతికి నిలయం...
సకలజనుల సకల కళలకు ఆలవాలమీదేశం

సంప్రదాయ సంస్కృతులకు ప్రతిబింబమీ దేశం
సర్వ ధర్మ సమభావన సమ్మిళితమీ దేశం
సంగీతసాహిత్యాల సారస్వతమీ దేశం
మహనీయుల రుషిమునుల జన్మభూమి ఈ దేశం

మహిమాన్విత మహిళలు ఉన్న పోరుగడ్డ ఈ దేశం
మతవిద్వేషాలు లేని మనుషులు ఉన్న ఈ దేశం
మహీతలమునందు మకుటాయమానం ఈ దేశం
మన దేశం పవిత్ర దేశం

జై హింద్

*(భారతదేశం ఘనతను చాటుతూ 'శౌర్యభారతం' పుస్తకంలో ప్రచురించిన కవిత...)*

# ఓ గాన గంధర్వుడా...!

❖

ఓ గాన గంధర్వ
నిగారించిన నిండు విగ్రహం మీరు
కోట్లాది గుండెల్లో
కొండెక్కని దీపం మీరు
శ్రోతలను మంత్ర ముగ్ధుల్ని చేసి
పాటల తోటలో విహరింప చేస్తున్న
కోకిల మీరు
తెలుగు పాటల అమృతధారల నింపుకున్న
పూర్ణకుంభం మీరు.
సంగీత స్వర సామ్రాజ్యానికి
రథసారథి మీరు
పాటల పల్లకినెక్కి ఊరేగుతూ
సుస్వరాలు పలికే సంగీత కోకిలమ్మ
ఒంటరిదై
కొమ్మపై కన్నీరు కార్చినట్లు ఉంది
ఈ పాటల ప్రపంచంలో
మీరు లేక.

పండిత పామరులను కూడా
సంగీత సముద్రంలో ఓలలాడించిన
ఓ గాన గంధర్వ
మీరు లేకున్నా
మీ పాట మా నోట నిత్య పారాయణం
ఓ అమర గాయక
బాల గాయకులకు ఊపిరి మీరు
గాన కళాకారుల తొలి అడుగులకు అండ మీరు
మా మనసు పొరల్లో ఓలలాడుతూ
తరలిపోతున్న గాన ఝరిలో
ప్రతిబింబమై కదులుతున్న మీరు

మీ గానం
వేల కోట్లమందికి వీనుల విందు
తెల్లవారగనే
గుడిలో గంటలా
మీ కంఠం సుప్రభాతమై వింటాం

మీ గాత్రం
గండు కోకిలలా శంఖారావం
ఓ సుస్వరాల స్వర మాంత్రిక
భారతమాత నాలుక మీద
ఓంకారం మీరు

మీ పాడుతా తీయగా
మాకు ఎప్పుడూ సజీవ స్వప్నమే
వేయి కోకిలలు  ఒకేసారి పాడినట్లు
కోకిల దండు పై ఎక్కుపెట్టిన
సరిగమల శరము మీరు

తెలుగు పాటల తేనేటీగలు జాలు వార్చే
మకరందం మీరు
పాటకు పర్యాయపదం మీరు

ఓ స్వరసామ్రాట్
కొత్త గొంతులను  స్వరపరిచిన వీణ మూగబోయినా
మీ నటనా చాతుర్యం స్మృతి
మాకు నిత్యస్మరణీయం
అయినా మీ గొంతులో జీర
మాకు అందించి నిరంతర సాధనలో నిమగ్నమై
మా మనసు పొరల్లో స్ఫూర్తిని నింపుతూ
వెలుగురేఖలు ప్రసరిస్తూ చీకట్లను చీల్చుకుంటూ
శూన్యంలోంచి దీవిస్తున్నట్లుగా ఉంది
ఓ అనుకరణ బ్రహ్మ

మా గుండె గుడిలో దీపమై వెలుగుతూ
మీ ప్రోత్సాహం మీ ఆశయం
ఇదే ఇక మా ధ్యాస శ్వాస లక్ష్యం
గొంతుకలో గుండెలు కలగలిపి
మీ ఆత్మకు శాంతి కలగాలని
అక్షర నివాళి అర్పిస్తున్న
సంగీత సవ్యసాచి మీకు

*(బాలు మరణించిన సందర్భంలో... అశ్రునివాళిగా రాసిన కవిత)*

# విశ్వమాత – విశ్వ దేవదూత

❖

అల్బేనియాలో జననం – అందాల భారత్‌కు పయనం
'ఆగ్నెస్' మీ నామధేయం –
అమ్మ (మదర్)గా థెరిస్సాగా స్థిర నామం
కలకత్తాలో మీ కరుణ – కదలి వెళ్ళింది ప్రపంచవ్యాప్తం
సేవామూర్తిగా అవతారం – మీ సేవయే జీవిత పరమార్థం
ప్రేమే మీ జీవితమార్గం – ప్రేమతో విశ్వ విజయం
విశ్వమంతా మిత్రృత్వం – విశ్వానికే సేవాతత్పరణం
సేవయే మీ జీవితాశయం –
'సెయింట్ హుడ్'గా దైవ అవతారం
'జీసస్' ప్రేమే మీ ఆయుధం –
జీవితాంతం క్రైస్తవం 'నన్'గా జీవనం
మదర్‌గా విశ్వవ్యాప్తం – 'మది'కే మహిమ మణిహారం
బ్రహ్మచారిణిగా జీవితకాలం – బ్రహ్మాండానికే బ్రహ్మానందం
కుష్టువ్యాధిగ్రస్తులతో మమేకం –
కుష్టు వ్యాధే పలాయనచిత్తం
నోబెల్ గౌరవించిన ప్రపంచం
భారతరత్న సత్కరించిన భారతదేశం

*(మదర్ థెరిసా జయంతి సందర్భంగా గురించి రాసిన కవిత)*

# సప్తస్వరాల వీణ జానకమ్మ

❖

సత్యవతమ్మ - శ్రీ రామమూర్తిల ముద్దుబిడ్డగా
23-04-1938న జన్మించి
వి. రాంప్రసాద్‌కు సహధర్మచారిణిగా
మురళీకృష్ణకు మాతృమూర్తిగా
అమృతవర్షిణికి నానమ్మగా
శ్లిష్ఠ శ్రీరామమూర్తి జానకమ్మగా మీరు
రాయిని సైతం కరిగించే మీ గానం శ్రోతలకు వీనులవిందు
మూడవ ఏటనుండే నాదస్వరం
పైడిస్వామి దగ్గర శిష్యరికం చేసిన మీరు
మైసూర్ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్
తమిళనాడు ప్రభుత్వం నుండి 'కలైమణి' పురస్కారం
పొందిన ఘనత మీది
దక్షిణ భారత కళాకారులకు సరియైన గౌరవం రాలేదని
పద్మభూషణ్ తిరస్కరించిన గొప్ప మానవతావాది మీరు
05-04-1957న తొలిసారిగా నా ఆశ అడియాస
లంబడోళ్ళ రాందాస
విదియణ్ విటెట్టు అన్న విషాదగీతాలు
ప్రారంభంలోనే పాడానని

బాధపడి– బిడ్డపుట్టగానే ఏడుస్తూనే కదా
లోకానికి వచ్చేది అని సరిపెట్టుకున్న మహానుభావురాలు
మీరు
వివిధ అవార్డులతోపాటు
వెన్నెల్లో గోదారి అందం పాటకు ఉత్తమ జాతీయ గాయని
అనిపించుకొన్న సంగీత సరస్వతులు మీరు.
తెలుగు, తమిల్, కన్నడతోపాటు వివిధ భాషలో
సంగీత దర్శకత్వం వహిస్తూ
30 వేల పాటలు పాడిన గానకోకిల మీరు
జానకమ్మ మీరు ఒక సంగీతఝరి
మీరు పాడే శైలి వేదం – నాదం
సరిగమపదనిసలను మీ గొంతులో ఆటలాడించిన సంగీత
విధుషీమణి మీరు
మీరొక భగవత్‌గీత – ప్రభోదాత్మకమైన పాటలు పాడిన
మధురస్వరాల పుట్టతేనెధార
మీరు సరస్వతి ఒడిలో ఒద్దికగా ఒదిగిన సుస్వరాల వీణ
మీ గానం మధురోహాల నవరసాల వీణ
సరిగమపదనిసల కోటిరాగాల సుస్వరాల వెల్లువ
మీరు ప్రకృతి ప్రేమిక
ఆలపిస్తుంది మీ గొంతుక మధురస్వరాలు
మీరు మూర్తీభవించిన మాతృమూర్తి సంగీత ప్రపంచానికి
భావితరాలకు మీ గాత్రం నిత్యపారాయణ స్తోత్రం
మా తెలుగు గాయక ఆణిముత్యం మీరు
నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో జీవిస్తూ
నిత్యం ప్రతిధ్వనించే
మా మమనసుల్లో ఓంకారనాదం కావాలి మీరు

*(సినీ నేపథ్య గాయని ఎస్. జానకి గారి జన్మదినం సందర్భంగా...)*

# అపర భగీరథుడు
# మా ఆర్థర్ కాటన్ దొర

❖

ఓ కాటన్ మహాశయా...
మీరు పుట్టింది ఇంగ్లాండ్ అయినా
మీరు చేసిన నిస్వార్థ సేవ
ఉభయ గోదావరి జిల్లా వాసులు
మరువలేని వరుణదేవుడు మీరు
గోదావరి డెల్టాను సస్యశ్యామలం చేసి
సిరిసంపదల పంట పండించిన అన్నదాతలు మీరు.
గోదావరి జిల్లావాసుల తలరాతను మార్చివేసిన
బ్రహ్మదేవుడు మీరు.
గోదావరి జిల్లా వాసుల హృదయంలో
గుడి కట్టుకొని పూజించే
ఆరాధ్యదైవం మీరు
దేవుని మించిన పదం
ఏదైనా ఉంది అంటే–
అది మీ పేరే కాటన్ మహాత్మా!

వరదలు వచ్చి
రెండు లక్షల మంది చనిపోయినప్పుడు
గోదావరి వరదలను అదుపు చేసే బాధ్యత
ప్రభుత్వం మీకు అప్పగించినప్పుడు
మీరు 1847లో ప్రారంభించి
1852న ధవళేశ్వరం బ్యారేజీ నిర్మించి
గోదావరి జిల్లా వాసుల గుండెల్లో గుడి కట్టించుకొనిన
అపర భగీరథులు మీరు.
ఉభయ జిల్లాలను సిరుల మగాణిగా మార్చి
గత చరిత్రను తిరగ రాసిన మహనీయులు మీరు .
కోనసీమను  అన్నపూర్ణగా మార్చివేసిన
పితామహులు మీరు.
ధవళేశ్వరం బ్యారేజ్ కట్టాలన్న మీ ఆలోచన
గోదావరి వాసుల తలరాతను మార్చివేసి
బీడు భూముల్లో బంగారం పండేలా చేసింది.
మన దేశ ప్రజలు
బ్రిటిష్ వారిని ద్వేషించినా
మిమ్మల్ని మాత్రం గుండెల్లో పెట్టుకున్నాం.
వేదంలా ఘోషించే గోదావరి వైభవమంతా
మీరు పెట్టిన భిక్షే పితామహా .
మా జిల్లాలో
ఏ పుణ్యకార్యం అయినా మిమ్మల్ని తలుస్థాము.
పుష్కరాల్లో కూడా
మీకు పిండప్రదానం చేసి
మా కృతజ్ఞత తెలుపుకుంటాం పితామహా.
గోదావరి అమ్మ ఉరకలు వేసినా
కృష్ణమ్మ పరుగులు తీస్తున్నా
కృష్ణమ్మకు “కొలారాన్” ఆనకట్ట వేసి
తంజావూర్ తలరాతను మార్చివేసి

పసిడి పంటలు పండించిన ఘనత
మీదే మహాశయ.
మీరు 1803లో జన్మించి
1899 మరణించిన "ఓర్ గారి" సాంకేతిక సహకారంతో
నిస్వార్థంగా చేసిన మీసేవ
ఇప్పుడు ఎప్పుడూ
మా గుండెలో
బతికే ఉంటుంది మహానుభావ....

*(ఆర్థర్ కాటన్ దొర పట్ల కృతజ్ఞతాభావంతో రాసిన కవిత)*

# తెలుగు భాష

❖

తేట తేనియ తెలుగు
తెల్లవారి వేకువ వెలుగు తెలుగు

దేశ భాషలందు తెలుగు లెస్స
అని పలికిన రాయలు
మెచ్చిన రతనాల తెలుగు

సుబ్రహ్మణ్య భారతి నోటా
పలికిన సుగంధాల
పరిమళం తెలుగు

ఆదికవి నన్నయ జనియించిన
తెలుగు నేల

తెలుగు భారతి మువ్వల్లో
మురిపంగా నవ్విన రవళి
తెలుగు సందళ్ళు

తెలుగు తల్లి నుదుట మెరిసిన
సింధూరం తెలుగు భాష తేజం

తెలుగు తల్లి మనసు
మమకారాల వెల్లువ
తెలుగు భాష సుగుణాల
సుకుమార సుగంధం

తెలుగు భాష మనకు జీవనాధారం
ఎక్కడ ఉన్నా ఎలా ఉన్నా
తెలుగు తల్లి మన శాశ్వత
చిరునామా

*(తెలుగు మాతృభాష దినోత్సవం సందర్భంగా రాసిన కవిత)*

# స్వప్నలోయలో విహరిస్తున్న ఓ కాల విహంగమా...

❖

స్వప్న లోకంలో విహరిస్తున్న
ఓ కాల విహంగమా...
ఏమని తెలిపెదము
మా కరోనా బాధలు!

వెళ్ళిపోతూ పూల కొమ్మపై జాలిగా నిలచిన
2020 ప్రాయపు కాల విహంగమా
కరోనా రక్కసినీ మట్టుపెట్టి వెళ్లి
మళ్లీ కొత్త పుంతలు తొక్కుతూ
పాలపిట్టల్లే పసిడి కాంతులు చిందిస్తూ రావమ్మా.
మాకు ఎంతో మంచి
విజయాలు మోసుకు రావమ్మా!

ప్రకృతిని చూసి పరవశించడం కాదు
పదిలంగా చూసుకొమ్మని

బ్రతుకులోని ఆనందం గూర్చి వివరిస్తూనే
కాస్త పట్టుదల ఆరాట, పోరాటాల గూర్చి కాస్త చెప్పమ్మా.
గత వసంతాల సంత సమంత వచ్చేదు వర్షపు భ్రాంతి అని
ప్రస్తుతం పద్ద శ్రమే
విజయాలకు నాంది అని
మరీ మరీ నొక్కి చెప్పమ్మా.
చైనాని అణచి
కరోనాని మటుమాయం చేసి
మాకు తెలియని ఇంద్రజాలమేదో
నీవే చెయ్యాలమ్మా.

సందట్లో సడేమియా అంటూ
బిచానా ఎత్తేసి చైనాకి కరోనా పారి పోవాలమ్మ.
అప్పుడు సంతోషంతో సందడంతా నీవే చెయ్యాలమ్మ-
ఎలాగంటే మంచి మంచి కృతులు నీవు పాడుతుంటే-
కోకిల తంత్రులు మీటుతుంటే -
వీణ మెట్లమీద రామచిలుక గమకాలు వొలకబోస్తుంటే-
కీబోర్డ్ మీద గువ్వల దండు కవాతు చేస్తూ ఉంటే-
గాలి పోసుకుంటున్నా పిల్లనగ్రోవిమీద మీద గోరువంక
అల్లరల్లరిగా అడుగులు వేస్తూ తీపి సంగతులు వినిపిస్తుంటే
తబల మీద ఆశయాల అల్లో నేరేళ్ళు వడగల్లుగా
రాలుతుంటే
మబ్బుల మంచె మీద రాయంచలు
చిత్రవిచిత్ర గతులలో ఎగిరిపడుతూ
సంతోష శబ్దాలు చేస్తూ నాట్యం చేస్తుంటే

ఓ కాల విహంగమా
అభివృద్ధి పథకాలను దోసిలి పట్టి
ఆశీర్వచనాలుగా మాపై కుమ్మరించమ్మ.

ఆషాడ మాసాన అందంగా గోరింటాకు పెట్టుకున్న –
ఎర్రగా బొద్దుగా పండిన మృదువైన జీవన రాగాన్ని
రేఖలుగా తీర్చిదిద్దిన ముద్దు గోల్పే ముచ్చటైన పసిపాప
చిరు చేయి అంతా అందంగా
మా భావి భారత ప్రజల భవిష్యత్తు మార్చమ్మ –
మమ్మల్ని భారతమాత బంగారు ఒడిలోన ముద్దుబిడ్డలుగా
మార్చి కీర్తి శిఖరాలు చేర్చమ్మ –
మరి గరుడ గమనివై వెళ్తావు కదూ!
మరి చిరునామా చెప్పనా!

*(కరోనా టైంలో కాలవిహంగాన్ని ఆహ్వానించిన సందర్భంగా రాసిన కవిత...)*

# పట్టణ బ్రతుకు - పల్లె బతుకు

❖

నగర జీవన సంక్లిష్టత పరిష్వంగంలో
నగరీకరణ
పారిశ్రామిక కారణాల వల్ల యాంత్రికమై పోతున్నా
సమకాలీన జీవితం
పోగొట్టుకుంటున్న అనేక విలువలను వెతుకుకుంటున్నది.
ఈ అన్వేషణలో
కొంత ఉపశమనం కలిగించేవి
పల్లెలు... పాడి పంటలు....

ప్రకృతితో లయ కలిపి నడిస్తేనే
మనిషి మనుగడ సాగుతుంది
నాగరికత తెలుసుకొని
ప్రకృతిలో మమేకమై నప్పుడే
జీవన సౌందర్యం ఇనుమడిస్తుంది.

నవనాగరికత నేర్చుకున్న నాగరీకుడు
నగరాన్ని విడిచి పల్లెకు చేరి

నవజీవన చైతన్యం గావిస్తుంటే
పల్లె తల్లి మనస్సు పరవశించింది.

పారిశ్రామిక అవసరాల కోసం
చక్కని పంట భూములను నిర్వీర్యం చేయడం
పర్యావరణాన్ని లెక్క చేయక పోవడమే కాదు
బహుళ అంతస్తుల కాంక్రీటు కుటీరాలు
మౌనదీక్షలో ఉండిపోయిన మహామేరువు లాంటి
ఆకాశహర్మ్యాలు కట్టడం
ప్రకృతి ప్రకోపానికి కారణం అవుతుంది

ప్రకృతిమాత దీనంగా
నువ్వు సుఖంగా బ్రతుకు – నన్ను బ్రతక నివ్వు అన్నట్లు
ప్రాధేయ పడుతుందని తెలుసుకోవాలి మానవుడు
ఈ రెండూ
మనిషి అదుపులో లేకపోవడమే
అసలైన విషాదం.

ఇప్పుడు మనం అనుభవిస్తున్న
కరోనా ప్రకృతి విపత్తు.

తొలకరికి పరవశించి పులకరించే రైతులు
ఆకలికి అన్న మవ్వడం తప్ప
అన్యాయం అబద్ధం చేతకాని వాళ్లు ఈ రైతన్నలు
ఆకలి గొన్న నోళ్ళలోకి
అన్నంముద్దలయ్యేటోల్లు ఈ కర్షకన్నలు.

కాలాన్ని కష్టముతో కలిసి కట్టి
శ్రమించే శ్రమైక జీవి రైతు

అతని శ్రమకు కొలత లేదు
రైతు స్వేదం అమూల్యం
శ్రమను దైవంగా భావించాలి
ఆ శ్రమనే మనల్ని రక్షిస్తుంది
అన్నమై అరచేతిలోకి వస్తుంది

బ్రతుకు విలువ తెలిసిన
బడుగు జీవులు రైతులు
కొండలైన పిండి చేసే
దండి బలమే రైతుకున్నది.
గుండె నైనా కోసి ఇచ్చే
దానగుణ మీ మనిషికున్నది
అందుకే రైతే రాజు.

అందుకే
మనం పట్టణంలో బ్రతుకుతున్న
పల్లెల్లో బ్రతుకుతున్న
మన బ్రతుకు తరువాతి తరాలకు
మహెూజ్వల మార్గ దీపిక కావాలి.

*(పట్టణ బతుకు – పల్లెబతుకు తేడాను తెలియజేస్తూ రాసిన కవిత)*

# నా కవితకు శ్రోతలు కావాలి

❖

కష్టపడితే కవిత రాదు
మనసు నిండాలి
కవిత పొంగాలి... పొర్లాలి
అప్పుడే కవిత జలపాతం అవుతుంది

నెలలు నిండితే బిడ్డ
గుండె నిండితే కవిత

నా కవితకు శ్రోతలు కావాలి
మల్లెల మనస్సుల వారు కావాలి
ఎల్లలు ఎరుగని వారు కావాలి
చందనం అందుకొనగలవారు కావాలి
మందార మనసు వారు కావాలి
కవితా పరిమళం అస్వాదించువారు కావాలి
నా కవితా సమసమాజానికి సమైక్యతను చాటాలి

నా కవితకు శ్రోతలు కావాలి
నా కవిత ఒక వారధి కావాలి

ఒక సారధి కావాలి
అది సాగరాలు దాటుతుంది
మనసులను మొలిపిస్తుంది మురిపిస్తుంది

నా కవితాతల్లి కన్నీరు కార్చరాదు
ఆమె అక్షరానికి తల్లి
కాని కన్నీరు అక్షరం కారాదు.

*(దూరదర్శన్ వారి వంటల కార్యక్రమంలో చదివిన కవిత...)*

# స్నేహితుల మధ్య చెలిమి
# మానవతకు బలిమి

❖

నా గుండె గాయాన్ని తన మనస్సుతో తడిమి
మాటలతో మందు రాస్తాడు నా స్నేహితుడు
కడదాక కనిపెడుతూ నన్ను కథానాయకున్ని చేస్తాడు
అతడే నా హితుడు!!

అన్ని తానై
అయినా తనదంటూ లేకుండా
త్యాగం చేస్తు ఉంటాడు నా మిత్రుడు!

కష్టాల్లో
నేను ఉన్నానంటూ వెన్ను తడతాడు
అందుకే
కడలికి కెరటానికి ఉన్న బంధం మా స్నేహం–
చినుకుకు మేఘానికి ఉన్న సంబంధం నా ప్రియ నేస్తం–
కంటికి రెప్పకు గల అనుబంధం ఆత్మీయ నేస్తం–

పుడమికి మొక్కకు ఉన్న బంధం ప్రకృతి నేస్తం–
హృదయానికి స్పందనకు ఉండే బంధం నిజమైన స్నేహం–
మట్టికి మనిషికి ఉండే సహజబంధమే కల్పవృక్ష స్నేహం–
కాగితానికి కలానికి ఉన్న సంబంధం చిరుస్నేహం–
సమాజానికి సాహిత్యానికి ఉండే బంధం చిరకాల నేస్తం–
స్నేహితుని సుఖాన్ని కోరే త్యాగగుణం స్నేహం–
నోరు జారిన మాట చేజారిన స్నేహాలు తిరిగిరావు–
స్నేహం పంచే మనసుంటే చాలు–
బోసినవ్వుల పాపాయి నుండి
రాలిపోయే పండు ముసలిదాక
అంతా మన స్నేహితులే–
అందుకే
స్నేహితుల మధ్య చెలిమి – మానవతకు బలిమి!!

*(స్నేహితుల చెలిమి గురించి రాసిన కవిత)*

# అక్షరమే ఆయుధం!

❖

వేదాలకైనా అక్షరమే
విజ్ఞానానికి సారథి, వారధి
అమ్మ అను మాట కూడా అక్షరంతోనే మొదలవుతుంది.
నేను నిరంతరం
అక్షర కుక్షిని అయినందుకు గర్వపడుతున్నా
ఒక చిన్ని మర్రి విత్తనమే మహావృక్షం అయినట్లు
మొదటి అక్షరమే ఎన్నో గ్రంథాలకు నాంది!

అక్షరమే ఆయుధం
విద్యార్థులకు విజ్ఞాన కిరణం
రాసే ప్రతి అక్షరం
వికసించే విజ్ఞాన కుసుమం
అద్వైత భావనలైన
అక్షరరూపంలోనే కదా మనకు బోధపడేది
రవి కాంచనిది కవి గాంచును అన్నారు.
ఏ భాష అయినా
అక్షరరూపం పొందినప్పుడే దానికి సార్థకత
లిపి లేని భాష నీటిమీద రాత లాంటిది.
కత్తిపోటు కన్నా కలం పోటుకు పదునెక్కువ
మాటల కన్నా

రెండు అక్షరాల 'శాంతి', ధర్మస్థాపన,
స్వేచ్ఛ, స్వాతంత్ర్యంని ఇస్తుంది.
అందుకే కత్తికాదు ఆయుధం
అక్షరమే హృదయాంతరాలలోకి వెళ్ళే
నిజమైన ఆయుధం.
అంధులకు కూడా స్పర్శతో జ్ఞానాన్ని తెలిపేది అక్షరమే.
మూగవాళ్ళ నేత్రాలలో పలికేది అక్షరమే.
బధిరుల గొంతులలో భావప్రకటితం అక్షరమే.
విద్యలేనివాడు వింతపశువు
అక్షర జ్ఞానం లేని మనిషి
అదిమానవునితో సమానం.
అక్షర యజ్ఞం కోటి యజ్ఞఫలం
అక్షరమే స్వచ్ఛత, సచ్ఛీలత, సౌశీల్యం, హింస, నీతి
న్యాయం, ధర్మం, నియమములను బోధిస్తుంది
అక్షరజ్ఞానం ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేస్తుంది,
అందలం ఎక్కిస్తుంది.
అక్షరమే మేలుకొనే ప్రకృతికి శ్రీకారం చుట్టుతోంది
ఏదైనా గతాన్ని స్ఫురణకు తెచ్చి
పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసేది
అక్షరబద్ధం గావించిన మన గ్రంథాలే కదా
ఆగిన పదాల గారడిలో
ఎందరి హృదయాలలో చెరగని ముద్ర వేసి
చిరస్థాయిగా నిలిచేది అక్షరమే.
కలం రాత ఆగినా చెదిరిపోనిది అక్షరమే
పురోగమించే చైతన్యాన కూల్చాలింక నిరక్షరాస్యత.

(అక్షరాస్యత గురించి ఉద్బోధిస్తూ రాసిన కవిత)

# తెలంగాణ బతుకమ్మ ఉయ్యాలపాట

❖

పల్లవి : శ్రీరామ జయరామ ఉయ్యాలో
సిరి తెలంగాణ ఉయ్యాలో

చరణం : చంద్రశేఖరన్న ఉయ్యాలో – వేసిన బాటలలో ఉయ్యాలో
మన తెలంగాణ ఉయ్యాలో – శ్రీ రామరాజ్యమయ్యె ఉయ్యాలో
దేశదేశాలల్ల ఉయ్యాలో – ధీటుగా నిలిచింది ఉయ్యాలో
తెలంగాణ కీర్తి ఉయ్యాలో – మారుమోగుతోంది ఉయ్యాలో
తెలంగాణ కీర్తి ఉయ్యాలో – దీవులను దాటింది ఉయ్యాలో
తెలంగాణ బతుకమ్మ ఉయ్యాలో –
బంగారు బాటలేయమ్మ ఉయ్యాలో

॥ శ్రీరామ ॥
॥ శ్రీరామ ॥

చరణం : కవితక్క కరుణతో ఉయ్యాలో – మా కోర్కెలన్నింటిని ఉయ్యాలో
మనసుతో తీర్చె ఉయ్యాలో – మన కవితక్క ఉయ్యాలో
మహా బాగ బతకమని ఉయ్యాలో –
మేము దీవిస్తునాన్నాము ఉయ్యాలో
తంగేడు, గునుగుల ఉయ్యాలో – తల్లి గౌరమ్మకు ఉయ్యాలో
తొరకాపు పూజలు ఉయ్యాలో – తొమ్మిదొద్దులు నీకు ఉయ్యాలో
చంద్రశేఖరన్న ఉయ్యాలో –

కట్టించిన బెడ్రూం ఇల్లల్లో  ఉయ్యాలో
గాజుల గలగలలు ఉయ్యాలో – గాన మాధుర్యాలు ఉయ్యాలో
॥ శ్రీరామ ॥
॥ శ్రీరామ ॥

చరణం : తెలంగాణ తల్లులు ఉయ్యాలో – తీరైన పూలతో ఉయ్యాలో
స్వంత ఇంటిముందు ఉయ్యాలో – బతుకమ్మలాడంగ ఉయ్యాలో
బడుగు జీవుల ఎడల ఉయ్యాలో –
పించిన్ పథకం పెట్టి ఉయ్యాలో
పెద్దలందరికి ఉయ్యాలో – అండగా నిలిచింది ఉయ్యాలో
సంక్షేమ పథకాలు చాలా పెట్టిండు ఉయ్యాలో –
ఆసరాగా నిలిచిండు ఉయ్యాలో
దండాలు దండాలు ఉయ్యాలో – మన కేటిఆర్‌కు ఉయ్యాలో
మరుమల్లె తోటల ఉయ్యాలో –
మన తెలంగాణ మెరిసింది ఉయ్యాలో
గౌరమ్మ తల్లి మాకు ఉయ్యాలో – గనమైన దీవెనలు ఉయ్యాలో
॥ శ్రీరామ ॥
॥ శ్రీరామ ॥

చరణం : అభివృద్ధి పరిమళాలు ఉయ్యాలో – ఆకాశమంటాలి ఉయ్యాలో
ఇచ్చి కాపాడు తల్లి ఉయ్యాలో – ఇంతులందరికీ ఉయ్యాలో
కన్నెపిల్లలకు ఉయ్యాలో – కళ్యాణలక్ష్మి పథకంలో ఉయ్యాలో
కళ్యాణమయ్యే ఉయ్యాలో – (2 సార్లు)
కన్నతల్లులందరు ఉయ్యాలో
కెసిఆర్ కిట్‌తో ఉయ్యాలో – కెసిఆర్ కిట్‌తో ఉయ్యాలో
కడు సంబరపడిరి ఉయ్యాలో –
॥ శ్రీరామ ॥
॥ శ్రీరామ ॥

చరణం : చంద్రశేఖరన్న ఉయ్యాలో – మిషన్ కాకతీయతో ఉయ్యాలో
చెరువులు–కుంటలు ఉయ్యాలో – చెలరేగి నిండాయి ఉయ్యాలో
పాడియు–పంటలు ఉయ్యాలో – పచ్చపచ్చ చేనులతో ఉయ్యాలో
పల్లెలంత మురిసె ఉయ్యాలో –
కర్షక కార్మిక ఉయ్యాలో – కడుపులే నిండాయి ఉయ్యాలో
కవితక్క సలువతో ఉయ్యాలో – తెలంగాణ జాగృతిలో ఉయ్యాలో
తెలంగాణ అంత ఉయ్యాలో – బతుకమ్మ సంబరాలతో ఉయ్యాలో
పూలతోట్లెలోలె ఉయ్యాలో – పూగాడుచుండె ఉయ్యాలో
తెలంగాణ జనులకు ఉయ్యాలో – తెలంగాణ తల్లి ఉయ్యాలో
మనసారా నిండుగ ఉయ్యాలో – దేవెనలీయమ్మ తల్లి ఉయ్యాలో
॥ శ్రీరామ ॥
॥ శ్రీరామ ॥

చరణం : చంద్రశేఖరన్న ఉయ్యాలో – పంపిణి చేసిన ఉయ్యాలో
బతుకమ్మ చీరలు ఉయ్యాలో – బాగుగ కట్టుకొని ఉయ్యాలో
బంగారు బతుకమ్మని ఉయ్యాలో – బహుసంబురంబునఉయ్యాలో
బాగుగ ఆడుకొందుము ఉయ్యాలో (2 సార్లు)
చంద్రశేఖరన్న ఉయ్యాలో – శతవత్సరాలు ఉయ్యాలో
'శతమానం భవతి' అని ఉయ్యాలో – ఆడి బిడ్డలందరము ఉయ్యాలో
ఆశీర్వదిద్దాము ఉయ్యాలో – ఆత్మీయత పంచుదాం ఉయ్యాలో
॥ శ్రీరామ ॥
॥ శ్రీరామ ॥

జై తెలంగాణ! జై జై తెలంగాణ!!

*(తెలంగాణ ప్రభుత్వం సంక్షేమపథకాల గురించి స్తుతిస్తూ పాడిన ఉయ్యాల పాట)*

# మన అభిమాన నాయకుడు
# కె.టి.ఆర్.

❖

ముఖ్యమంత్రి వారసులుగా
కె.సి.ఆర్., - శోభల ముద్దుల తనయునిగా
శైలిమతో సహజీవనం
అన్యోన్యతలో అరుంధతి వశిష్ఠులుగా
హిమాన్షు - ఆలేఖ్యలకు - మురిపాలు పంచు తండ్రిగా
కవిత ఆశిస్సులతో - ఇంతై వటుదింతైనట్లుగా
మీరు
పున్నమి చంద్రుడిలా దినదినాభివృద్ధి అవుతూ
తెలంగాణకు విజయసారథిగా
తండ్రికి తగ్గ తనయుడిగా-
రాజకీయ చతురత తెలిసిన రాజనీతిజ్ఞులుగా
సిరిసిల్లలో జవులిపార్కులు స్థాపించి
నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపిన పారిశ్రామికవేత్తగా
మన రాష్ట్ర గొప్పతనం దేశవిదేశాల్లో చాటి చెప్పుతూ -
పెట్టుబడులు పట్టుకొచ్చిన ఆర్థికవేత్తగా-

మన హైదరాబాదులో హై.టి. హబ్ స్థాపించి
తెలంగాణ గణతను
ప్రపంచానికి చాటి చెప్పిన ఐ.టి మినిస్టర్‌గా
సకల జనుల సమ్మె
పవర్ ప్లాంట్ ప్రజెంటేషన్లతో
యువతరాన్ని ప్రభావితం చేసిన రోల్ మోడల్ గా
ఉన్నత చదువులు చదివినా
తెలంగాణ సాధించాలన్నా ఆకాంక్షతో
రాజకీయ రణరంగంలోకి ప్రవేశించి
నవతరానికి అభిమాన నాయకులయ్యారు.
మీకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ
మీరు భవితలో తెలంగాణకు బంగారు బాటలు వేయాలని
తెలంగాణ అడపిల్లలతో పాటు
అక్షర కౌముది కవులందరము
ఆత్మీయతా బిందువుల అక్షరాలను తడిపి
ఆశీస్సులందిస్తున్నాం ఇదే...
జై తెలంగాణ!!

*(కె.టి.ఆర్. జన్మదిన సందర్భంగా ట్విట్టర్‌లో పెట్టిన కవిత)*

# ఇందిరా ప్రియదర్శిని

❖

జవహర్‌లాల్ – కమలా నెహ్రూల
గారాల పుత్రిక ఇందిరమ్మ!

దేశభక్తి, త్యాగం, సాహసం,
ధైర్యం, ఉత్సాహం ఆమె స్వంతం
బాపూజీ ప్రభావంతో స్వతంత్ర కాంక్షను అలవర్చుకొని
తండ్రివద్దనున్న 'జోన్ ఆఫ్ ఆర్క్' జీవిత చరిత్ర చదివి
బాల్యదశలోనే దేశానికి సేవ చేయాలని
సంకల్పించుకొన్న ధీర – వీరవనిత ఇందిరమ్మ!

చిన్నతనంలోనే
దేశభక్తితోపాటు త్యాగనిరతిని అలవరచుకొని
విదేశీవస్తువుల బహిష్కరణ ఉద్యమంలో
తనకు ప్రాణప్రదమైన
విదేశీ ఎలుగుబంటి బొమ్మను
అగ్నికి ఆహుతి చేసిన
స్వదేశీ ప్రేమికురాలు ఇందిరమ్మ!!

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో
నెహ్రూగారి అడుగుజాడల్లో పయనించిన నాయకురాలు
బాపూజీ ఆశయసాధనకై నిరంతరం శ్రమిస్తూ
వారితో పాటు కారాగార శిక్షను అనుభవిస్తూ
తన దేశభక్తిని చాటుకున్న దేశభక్తురాలు ఇందిరమ్మ!!

భారత తొలి మహిళా ప్రధానిగా
మొరార్జీ దేశాయ్‌తో పోటీపడి గెలిచిన మన ఇందిరమ్మ
బ్యాంకులను జాతీయం చేయడం
రాజభరణాలు రద్దు చేయడం
భారత సేవక సంఘ సాంఘిక సంక్షేమ సంస్థలను
ఏర్పరిచిన సంఘసేవా సంస్కర్త మన ఇందిరమ్మ
గరీభి హఠావో అంటూ
బీదవారికి అభయహస్తాన్ని అందించిన
సకలజనాభివృద్ధికి
ఇరవై సూత్రాల పథకాల్ని అమలుపరిచి
సమాజ సంక్షేమంకై పరితపించిన సంక్షేమ దీప్తి-
జాతి భద్రతకు - సమైక్యానికి
అత్యవసర పరిస్థితిని విధించి
నేర్పుతో ఓర్పుగా దేశ సమైక్యతను
కాపాడిన వీరవనిత ఇందిర
అలీన రాజ్యాల మహాసభకు అధ్యక్షురాలిగా ఎన్నికై
ప్రపంచ దేశాలన్నిటిని అహింసామార్గంలో నడిపించి
కామన్‌వెల్త్ సభలను అత్యంత వైభవంగా నిర్వహించిన
ప్రతిభాశాలి ఇందిరా ప్రియదర్శిని!!

*(ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాసిన కవిత)*

# సావిత్రి భాయి పూలే

❖

భారతదేశంలో తొలి ఆదర్శ ఉపాధ్యాయిని-
గొప్ప సంఘ సంస్కర్త మన సావిత్రిభాయి పూలే-
స్త్రీల విద్యాభివృద్ధికి-
పీడిత ప్రజలకై పాటుపడిన
తొలితరం మహిళా ఉద్యమకారిణి-
విద్య - సాంఘిక దురాచారాలు,
సతీసహగమనం, బాల్యవివాహాలు
విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని
భర్తతో కలిసి 1848 జనవరి 1న పూణేలో బాలికల
పాఠశాల ప్రారంభించిన ధీశాలి.
ఆమె మానవ హక్కుల గురించి
సామాజిక సమస్యల గురించి
స్త్రీలను చైతన్యపరిచి
1852లోనే మహిళా సేవామండల్‌ను స్థాపించారు.
జెండర్ సమస్యలకు తోడుగా
కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా
స్త్రీల సాధికారత కోసం కృషి చేశారు.

మహిళా హక్కులే మానవ హక్కులని నినదించారు.
1896-97లో సంభవించిన తీవ్ర కరువు
ప్లేగు వ్యాధి ప్రబలినపుడు
సేవచేయడమే కాదు
జోలెపట్టి విరాళాలు సేకరించిన దయార్ధ్ర.
చివరికి ప్లేగు వ్యాధితోనే మరణించిన నిత్య స్మరణీయురాలు
నూట డెబ్బయ్యేళ్ళ క్రితం
ఆడపిల్ల బయటకు రావడమే కష్టం
అలాంటి రోజుల్లో సమాజ చాదస్తపు పోకడలకు
ఎదురొడ్డి ధైర్యంగా ఓ మంచి సంకల్పంతో జీవితాంతం
ముందు సాగిన స్ఫూర్తి ప్రదాత మన సావిత్రి బాయి ఫూలే.

*(సావిత్రి భాయి ఫూలే జయంతి సందర్భంగా రాసిన కవిత)*

# సాహిత్య సత్యాన్వేషకులు 'సినారె'

❖

ఓ 'సినారె' మహానుభావా
మీ రచనలతో కోట్లాది ఎదల మీటి
కఠినాత్ములను కూడా
కరుణతో కరిగించేది మీ పాట–

చిగురాకుల చిత్రముగ
పదములను మల్లెపూదండగా కుచ్చి
జగములనూగించి జాగృతిని కలిగించు
మీ కలం నుంచి జాలువారిన మీ పాట–

సమస్యల స్రవంతులకు ప్రశాంతత నొసగే
పదజాల కూర్పుల తోరణం మీ పాట–
మనో నేత్రానికే సత్యాన్వేషణ నొసగే
అనంతయాత్రకు మణిదీపం మీ పాట–

గాడాంధకారాలు– వెన్నెల వెలుగులు
వికసించిన పుష్పాలు, పక్షుల మృదుమధుర కూజితాలు
కథావస్తువుగా మలచుకొని మరోలోకం
సృష్టించే ప్రేమామృతం మీ పాట–

స్త్రీ పురుష బంధాలను
తోబుట్టువుల ఆత్మీయతా అనుబంధాలను
మొగ్గ తొడిగించి నిగ్గు తెలించి
మనసులలో మల్లియలే విరపూయించే
చాకచక్యమే మీ పాట–

పాటతో నింపారు
ప్రకృతియంతయును కూడ
పాడుకొనుచున్నది ప్రపంచమంతా
ప్రణవగీతమును–

మీ పాట వింటూ ప్రతి జీవి –
తల్లి వొడియందు నిద్రించు
పసిపాపవలె పరవశిస్తుంది–
సత్యం–శివం–సుందరమై
సమత మమతలను చాటుతూ
గమ్యానికి దారి చూపిస్తుంది మీ పాట
మానవాళిలోన మమేకమై
పండిత పామరుల వోట నిలుస్తుంది
విశ్వవేదికయందు విలసిల్లుతుంది
మీ పాట అంబరాన
చందమామవలె వెలుగుతుంది
అందుకే ఓ సాహిత్య హాలికుడా
మీరు లేకున్నా
పగటిపూట సూర్యుడిలా ఎల్లప్పుడూ
ప్రకాశిస్తూనే వుంటారు కవివర్యా–

*(సినారె మరణించిన సందర్భంలో రాసిన కవిత)*

# చెట్టుతో నా స్నేహం

❖

చెట్టుతో నా స్నేహం ఈనాటిది కాదు
అనాదిగా మనకు అమ్మ ప్రేమను పంచే ఆత్మీయురాలు–
అమ్మలాగ చెట్టు ఎంతో ఔదార్యగుణం కలిగి ఉంటుంది–
చెట్టు వేళ్ళలో సహనం నింపుకొని
కాండంలో క్షమతో ఎదుగుతుంది
శాఖోపశాఖలుగా దయ కలిగి ఉంటుంది
ఆకులలో అనురాగం నింపుకుంటుంది
పూవులలో పరిమళించిన మమకారం కలిగి ఉంటుంది.
ఫలాలలో దానగుణం పండిస్తుంది
అమ్మలాగ అమృతత్వం నింపుకొన్న
కన్పించే దైవమే ఈ చెట్టు తల్లి
మరణిస్తూ కూడా పరోపకారమే చెట్టు పరమార్థం.
చెట్టు మనకు పంచే మమకారం వెల కట్టలేనిది
చెట్టు ఎన్నో సుగుణాలు కలిగి
తన సర్వస్వం మనకు పంచి ఇస్తుంది
మనకు నీడనిచ్చి– గాలినిచ్చి– ఆకలితీర్చే అమృతమూర్తి–
మనకు ఊపిరిపోస్తూ
తాను మరణించి తన తనువును అర్పిస్తూ
లోకానికి వెలుగునిచ్చే చల్లనితల్లి–
ఈ త్యాగం కేవలం చెట్టు జన్మకే సాధ్యం
అందుకే చెట్టుతో స్నేహం చేసే
నా జీవితం ఎంతో ధన్యం– ధన్యం–

# చెయ్యెత్తి జైకొడ్త నేతన్న!

చెయ్యెత్తి జైకొడ్త నేతన్న
గతమెంతో ఘనకీర్తి నీదన్న!!

మగ్గాల మీద నీ చేతులతో నేసిన చీరలు
మగువల మనసుల దోచిన
అగ్గిపెట్టెలో అమరిన చీర
పొదిగిన పంచవన్నెల పట్టు చీర
ఒలంపిక్ జెండా నేసిన...
కుట్టులేని బట్టలు నేసిన...
నీ ప్రతిభకు నిలువెత్తు సాక్ష్యాలు కదన్న!

మన చేనేత పరిశ్రమ
పికిలిన పీతాంబరం అయినప్పుడు
పద్మశాలి ప్రతిభాపాటవాలను ప్రదర్శించి
ప్రపంచాన్ని సిరిసిల్లా ముంగిట్లోకి
తెచ్చిన ఘనకీర్తి నీదేనన్న–

సిరిసిల్లా

సిరుగుల రంగు వెలసిన జెండా అయినపుడు–
దారితోచక బిక్కుమన్నపుడు
పద్మశాలి వ్యవస్థ
పగిలిన పిల్లనగ్రోవిగా మారినపుడు
పరిశ్రమకు కొనవూపిరిలూది ముందుకు నడిపిస్తుంది
మన ప్రభుత్వమే కదన్న!

పరిశ్రమ పతనమై ఆత్మహత్యా పర్యవసానమై
గాయపడి రెక్కలు తెగిన పక్షిలా పడి ఉన్నప్పుడు
పరిస్థితులను కేంద్రప్రభుత్వానికి విన్నవించి
జీవగంజి పోసిన మన కుల బాంధవుల కృషి
ఎంతో అభినందనీయమన్న!

మన తెలంగాణలో
గొల్లబామ చీరలతో
బ్రతుకమ్మ చీరలతో
సిరిసంపదల మేఘాల వర్షం కురిపించి
పద్మశాలి ప్రతిష్ఠను
దేశవిదేశాల వ్యాపింపచేసిన ఘనత నీదేనన్న!

మగ్గాలన్ని పొయ్యిలో పడి
మాడి మసై పోతున్నప్పుడు
అపర భగీరథుడిలా
ఆదుకుని జాగృతం చేసిన ఆపద్బంధువు
మన ప్రభుత్వమే కదన్న!

ఒకప్పుడు శాలోళ్ళ చాకిరంత
సాలెగూడులో చిక్కిన ఈగ మాదిరి అయినపుడు
అక్కరకు రాని ప్రతిపార్టీ

అభివృద్ధి గుణింతాలు వల్లెవేస్తూ
ఓట్లు వేయించుకుందే గానీ–
నీ కష్టాన్ని లెక్కించడంలో మాత్రం
ఎపుడూ తప్పే జేసిందన్న–

కానీ ఇప్పటి మన ప్రభుత్వం మాత్రం
ఋణాలు మాఫీ చేస్తూ
టెక్స్‌టైల్ పార్కులు పెడుతూ,
అఫెరల్ పార్కులు పెడుతూ,
చేనేత చేయూత, నూలు సబ్సిడి రాయితీలతో పాటు
నేతన్నకు ఎన్నో సంక్షేమ పథకాలు ఇస్తూ
ప్రోత్సాహించడం ఎంతో అభినందనీయమన్న

నిన్నటికి నిన్న
మన కె.టి.ఆర్. గారు
దుబ్బాక సహకార సంఘానికి
కోటిరూపాయల క్యాపిటల్ ఇవ్వడమే కాదు
పూర్తిగా ఋణాలు మాఫీ చేసి వెళ్ళడం
మనకు ఎంతో సంతోషదాయకం!

ముఖ్యంగా లెనిన్ వస్త్రాల ఉత్పత్తిలో
మన దుబ్బాక మండలం సొసైటీ
తెలంగాణలో నెంబర్ వన్ స్థాయికి ఎదగడం
మనందరికీ
ఎంతో గర్వకారణం.
ఇంకా చెప్పాలంటే
దుబ్బాక మండలంలోని దుంపలపల్లి గ్రామంలో
గొల్లబామ చీరలు నేస్తూ
పోచంపల్లి, బచ్చన్నపేటలో కూడా పట్టు వస్త్రాలు నేస్తూ

ఎంతో ప్రఖ్యాతి గడిస్తున్నారు.
సమంత గారు
దుబ్బాక చేనేత వస్త్రాలకు
బ్రాండ్ అంబాసిడర్ కావడం కూడా
మనకు గర్వకారణమని చెప్పుకోవచ్చు.
అందుకే నేతన్నలు
ప్రతి సంక్షేమ పథకాన్ని
సక్రమంగా వినియోగించుకొని
చేనేత పరిశ్రమలను
అభివృద్ధి బాటలో ముందుకు నడిపించాలి

అందుకే
చెయ్యెత్తి జైకొడ్త నేతన్న
నీకు గతమెంతో ఘనకీర్తి నీదన్న!

*(నేతన్నల సంక్షేమాన్ని ఆశిస్తూ రాసిన కవిత)*

# ఉగాది కోసం

పచ్చని పట్టుచీర కట్టుకున్న ప్రకృతి కాంత
తాతయ్యనైన నన్నడిగింది–
'నేనెందుకు ఈ చీర కట్టుకున్నానో తెలుసా?' అని...

కొత్తపాట అందుకున్న కొమ్మమీది కోకిలమ్మ
నాన్నమ్మనైన నన్నడిగింది–
'నేనెందుకిలా
ఎర్రెర్రని సిగ్గుతెరలు పూయిస్తున్నానో తెలుసా?' అని

తోటనిండా విరబూసిన ప్రతి పూలరెమ్మ
అమ్మమ్మనైన నన్నడిగింది–
'మేమెందుకిలా
నవపరిమళాలు ఒలుకుతున్నామో తెలుసా?' అని

పున్నమి వెన్నెలన్ని నాన్ననైన నన్నడిగాయి
'మేమెందుకిలా మీ యింటి ముంగిట వెలుగుపూలై
కురియుచున్నామో తెలుసా' అని?

వెలుగుపూలు పూస్తున్న వేపకొమ్మ నన్నడిగింది
'నేనెందుకిలా చేదుచేదుగా విరగబూశానో తెలుసా?' అని

తీపి.. పులుపు... వగరు రుచులు అందించే మామిడికొమ్మ
అమ్మనైన నన్నడిగింది–
'నేనెందుకిలా విరగకాశానో తెలుసా?' అని

ఎర్రగా కాల్చిన కొత్తకుండ నన్నడిగింది
'ఎందుకు నన్నందరూ
ఇంటికి తీసుకెళ్తున్నారో తెలుసా?' అని–

ఝూంకార ఓంకారాలతో ఇల్లిల్లూ తిరిగే
తుమ్మెద బంధువర్గాన్ని అడిగింది–
'నేనెందుకిలా
ఇల్లిల్లూ తిరుగుతూ ఆహ్వానిస్తానో తెలుసా?' అని

ఏమి తెలియదని తెల్లమొహం వేసినామా
అందరకు తెలిసింది
ఇదంతా–
'ఉగాది' కోసమని
ఈ ఉగాది మనందరకు
క్రొంగ్రొత్త శుభాలను తీసుకొస్తుందని.

*('ఉగాది' కవిసమ్మేళనంలో చదివిన కవిత)*

# అటల్‌జీ...! అమర్ రహే...!!

❖

అమర్ రహే! అమర్ రహే!!
అటల్ జీ...! మీరు అమర్ రహే!!
నిష్క్రమించారా అటల్ జీ... పడమటి కనుమల్లోకి
కనుమరుగై అస్తమిస్తున్న సూర్యుడిలా...
ఉదయించి సూర్యుడిలా మళ్ళీ మన భారతావనిలోనే.
తిరుగు ప్రయాణం కట్టి మళ్ళీ జన్మించాలి అటల్ జీ...
ప్రథమ పౌరులై మీరు ఐక్యరాజ్యసమితిలో అద్భుతమైన
ప్రసంగాలతో ఆకట్టుకున్నారు అటల్ జీ...
మీ కవితాగానం... రచనా వ్యాసాంశాలతో శ్రోతల్ని
మంత్రముగ్ధుల్ని చేసేవారు అటల్‌జీ మీరు...
మీ హయాంలో పోఖ్రాన్ ప్రయోగించి 100 కోట్ల పౌరుల
హృదయాలలో ఆత్మవిశ్వాసం పెంచిన ఘనత మీదే
అటల్‌జీ!
నాలుగు స్వర్ణపథకాలు స్థాపించి – దేశాన్ని నాలుగు
పాదాలతో ధర్మ పథాన నడిపించిన చతురులు మీరు...
ఎమర్జెన్సీలో కీలకపాత్ర విశ్వసించిన భీష్మపితామహులు
అటల్‌జీ మీరు...
భారతరత్నానివై మీరు

భారతమాత ఒడిలోంచి నేలరాలిన పుష్పానివై మీరు–
మళ్ళీ మంచిగంధం చెట్టువలె మళ్ళీ మొలకెత్తి
భారతమాత మెడలో పుష్పం వలె వికసించాలని
మేమంతా ప్రార్థిస్తున్నాం
మీ ఆత్మకు శాంతి కలగాలి'–
మా హృదయాల్లో సదా మీరు నివసిస్తూనే ఉండాలని
అశ్రుతర్పణం
మీకిదే మా సదా... భారతావణి
అటల్ జీ... అమర్ రహే...
అటల్‌జీ! అమర్ రహే!!

*(అటల్ బిహారీ వాజ్‌పేయికి అశ్రుతర్పణం అర్పిస్తూ రాసిన కవిత)*

# మంచి మగవాడు

❖

ప్రతి పురుషుడు కాంతి విజయకాంక్షుడు
ప్రతి విషమ పరీక్షలలో ప్రతిభాశీలుడు
పంజర రహిత జీవితస్వేచ్ఛా జీవుడు
పంచభూతాల సాక్షిగా భార్యావిధేయుడు
చలించెడి కరుణ సహృదయుడు
చరణదాసిని ప్రేమించే స్వచ్ఛహృదయుడు
పురుషునిగా అహంకార శూన్యుడు
పుడమితల్లి బిడ్డడుగా జన్మధన్యుడు
రుజుమార్గమున నడిచెడి సన్మార్గుడు
రుసరుసలాడిన ఆలి ఆనందకరుడు
షడ్రుతువుల యందు సంతోషుడు
షడ్రుచుల ఆరగించే జీవితానుభవుడు
దినమంతా శ్రమించే కష్టజీవుడు
ధిక్కారం లేని ప్రేమజీవుడు
నలపాకమునందు పాకశాస్త్ర ప్రావీణ్యుడు
నలుగురిలో మార్పును కోరే కార్యదక్షుడు
ముచ్చటగా మూడుముడులువేసే ప్రియభాందవుడు
ముదిమి వయస్సులో నిత్యప్రశాంతుడు
అతడే అతడే అసలైన మగాడు!

*(మంచి మగవాడి గురించి వివరిస్తూ రాసిన కవిత)*



## పురస్కారాలు

- రోజా ఆర్ట్స్ క్రియేషన్స్ వారు నిర్వహించిన పోటీలో 'పరిపూర్ణ మహిళ – 2007' పురస్కారం.
- వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి మూడవ జాతీయ తెలుగు మహిళా రచయితల సాహితీ సమ్మేళన పురస్కారం (21–08–2016).
- తెలంగాణ జాగృతి రాష్ట్రవ్యాప్త కవిసమ్మేళన పురస్కారం (09–04–2017).
- తెలుగు రక్షణ వేదిక ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ & కల్చరల్ కమీషన్ వారు నిర్వహించిన 33 గంటల 44 నిమిషాల 5 సెకన్ల ప్రపంచ రికార్డు కవిసమ్మేళనం (అనంతపురం) లో పురస్కారం (2017).
- తెలంగాణ రైతు హార్వెస్టర్ అసోసియేషన్, కరీంనగర్ వారు నిర్వహించిన కృషి కవిత ప్రపంచ రికార్డు పురస్కారం మరియు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు పురస్కారం (10–09–2017).
- ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా గౌరవనీయులైన హరీష్‌రావు గారిచే పురస్కారం (14–12–2017).
- ఉదయ కళానిధి వారి యాదాద్రి శిల్పకళా వైభవ పురస్కారం (15–07–2018).
- 'నాన్న ఘనుడు – త్యాగధనుడు' కవితకు ఉత్తర అమెరికా వారి విశిష్ట బహుమతి పురస్కారం (22–06–2020).
- తరుణిమిత్ర అవార్డు డా॥ మమతా రఘువీర్ గారి పురస్కారం (08–03–2021).

- తెలుగు బుక్ ఆఫ్ రికార్డు వారి ప్రపంచ మహిళా తెలుగు కవితా మహోత్సవం - 2021 పురస్కారం (23, 24, 25 ఏప్రిల్, 2021).
- వంశీ గ్లోబల్ అవార్డ్స్ వారి ప్రపంచ మహిళా తెలుగు కవితా మహోత్సవం - 2021 పురస్కారం (23, 24, 25 ఏప్రిల్, 2021).
- ఇంకా శతాధిక ప్రశంసాపత్రాలు.
- **రచనలు - ముద్రితాలు :** గుప్పెడు గుండెను తడితే

  **అముద్రితాలు :** భావ వర్ణాల లోగిలి, పూర్ణచంద్రికలు, సూక్తిముక్తావళి, భావ వీచికలు మొదులగునవి.

*"లోకా సమస్తా సుఖినోభవంతు"*

